జనం కోసం - మన అక్షరం

# అక్షర వెలుగు

TELTEL02057

www.aksharavelugu.com

తెలుగు దిన పత్రిక

శని వారం

16.04.2022

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్

సంపుటి - 01, సంచిక-52

పేజీలు - 4 వెల రూ. 5

**విలేకరులు కావలెను**

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో విలేకరులుగా పనిచేయడానికి ఆహ్వానిస్తున్నాము. సామాజిక దృక్పథం, అవినీతి, అక్రమాలపై అక్షర గళాన్ని వినిపించే దమ్మున్న విలేకరులు 'అక్షర వెలుగు' తెలుగు దిన పత్రికలో పని చేయడానికి ఈ క్రింది మేయిల్ అడ్రస్‌కు వివరాలను పంపండి

aksharavelugudaily@gmail.com

8985893382

Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Karimnagar, Warangal, Mahaboobnagar, Kammam, Medak



## మీ తాటాకు చప్పుల్లకు బెదిరేదిలేదు

ఫోన్ బెదిరింపులకు ప్రతి స్పందన

"మీ బ్లాక్‌మెయిల్ బేహారి భాషా మాకు కొత్త కాదు.
మీ బేసి అహంకారానికి తలొగ్గేది లేదు.
ప్రజా సమస్యలపట్ల చిత్తశుద్ధి కలిగిన జర్నలిస్టులుగా ముందుకు సాగుతాం.
వ్యవస్థలో జరిగే లోపాలను ఎత్తిచూపడం, ప్రశ్నించటం మా కనీస కర్తవ్యం. పీడిత బాధితులు ఎవ్వరైనా అక్షర వెలుగును సంప్రదిస్తే స్పందిస్తాం...
నిజాలను నిగ్గదీస్తాం...
ఇది మా 'అక్షర వెలుగు' దిన పత్రిక నైజం.




ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా పనిచేసే పత్రికలు, అలాంటి పత్రికలలో పనిచేసే నికాసైన జర్నలిస్టులకు ఎవరి పట్ల విభేదాలు, విద్వేశాలు ఉండవు.
మా జర్నలిజంలో వ్యక్తిగత బేషజాలకు తావు ఉండదు అని అక్షర వెలుగు దిన పత్రిక యాజమాన్యం నొక్కిఒక్కానిస్తుంది

# భారత న్యాయవ్యవస్థ మరింత బలోపేతం

**తెలంగాణ న్యాయధికారుల సదస్సులో చీఫ్ జస్టిస్ రమణ వ్యాఖ్య**



- అందుకు తనవంతుగా కృషి చేస్తున్నా
- తెలంగాణలో జడ్జిల సంఖ్యనుపెంచాం
- తెలంగాణలో కేసీఆర్ 4 వేల 320కి పైగా ఉద్యోగాల కల్పన
- చేతికి ఎముక లేదన్న ట్రేడ్ మార్క్ కెసిఆర్‌దే
- అందరి సహకరాంతో పురోగమిస్తున్నామన్న కెసిఆర్

**హైదరాబాద్, ఏప్రిల్ 15 (అక్షర వెలుగు):** భారత న్యాయవ్యవస్థను మరింత బలపరచాలని భావిస్తున్నట్లు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ తెలిపారు. హైదరాబాద్‌లో జరుగుతున్న తెలంగాణ న్యాయధికారుల సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తెలంగాణ హైకోర్టులో రెండేళ్లుగా పెండింగ్‌లో ఉన్న జడ్జిల పెంపు అంశాన్ని పరిష్కరించామని చెప్పారు. జిల్లా కోర్టుల్లోనూ జడ్జిల సంఖ్య పెంచుతున్నామన్నారు. దేశవ్యాప్తంగా ప్రభుత్వ ఉద్యోగుల సంఖ్య తగ్గించాలని భావిస్తుం టారని.... తెలంగాణలో కేసీఆర్ మాత్రం 4 వేల 320కి పైగా ఉద్యోగాలను సృష్టించారని అభినందించారు. చేతికి ఎముక లేని తనానికి ట్రేడ్ మార్క్‌గా కేసీఆర్ అని జస్టిస్ ఎన్వీ రమణ వ్యాఖ్యానించారు. హైదరాబాద్ గచ్చిబౌలిలోని అన్వయ కన్వెన్షన్‌లో జరిగిన న్యాయాధికారుల సదస్సుకు సీజేఐ ఎన్వీ రమణ, హైకోర్టు సీజే జస్టిస్ సతీష్ చంద్ర శర్మ, ఏపీ హైకోర్టు సీజే జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్ర, సీఎం కేసీఆర్, మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి హాజర య్యారు. న్యాయవ్యవస్థ బలో పేతానికి కేసీఆర్ కృషిచేస్తున్నారని తెలిపారు. హైకోర్టులో ఇటీవల జడ్జిల సంఖ్య పెంచాం. కేసుల త్వరితగతిన పరిష్కారానికి జడ్జిల సంఖ్య పెంపు అవసరం అన్నారు. రెండేళ్లుగా పెండింగ్‌లో ఉన్న జడ్జిల సంఖ్య పెంపు అంశాన్ని పరిష్కరించాం. న్యాయవ్యవస్థను ఇంకా బలపర చాలని భావిస్తున్నాం జిల్లా కోర్టు ల్లోనూ జడ్జిల సంఖ్య పెంచు తున్నాం. దేశవ్యాప్తంగా ప్రభుత్వ ఉద్యోగుల సంఖ్య తగ్గించాలని భావిస్తుంటారు. ఇటీవల హైదరాబాద్‌లో అంతర్జాతీయ ఆర్బిట్రేషన్ మీడియేషన్ సెంటర్ వచ్చింది. వివాదాల



సత్వర పరిష్కారానికి ఈ కేంద్రం ఉపయోగ పడుతోంది. తమ రాష్ట్రాల్లోనూ ఇలాంటి కేంద్రం ఏర్పాటు చేయాలని కోరుతున్నారని జస్టిస్ ఎన్వీ రమణ అన్నారు. న్యాయవ్యవస్థ బలోపేతానికి కేసీఆర్ కృషిచేస్తున్నారని చెప్పారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత న్యాయాధికారుల సమావేశం జరగడం 2

## దేశంలో కొనసాగుతున్న టీకా పంపిణీ



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 15 (అక్షర వెలుగు):** దేశంలో కరోనా టీకా పంపిణీ వేగంగా సాగుతోంది. 6,66,660 మందికి టీకాలు అందించారు. దీంతో ఇప్పటివరకు పంపిణీ చేసిన డోసుల సంఖ్య 1,86,30,62,546కు చేరింది. కొత్తగా 367,213 కరోనా టెస్టులు నిర్వహించారు. ఇప్పటివరకు మొత్తం 795,756,615 కరోనా పరీక్షలు చేశారు. మరోవైపు, ప్రపంచవ్యాప్తంగా 938,297 కొత్త కేసులు నమోదయ్యాయి. మహమ్మారి ధాటికి 3,370 మంది ప్రాణాలు కోల్పోయారు. దక్షిణ కొరియా, జర్మనీ, ఆస్ట్రేలియా, ఇటలీ, ఫ్రాన్స్, దేశాల్లో కొవిడ్ ఉద్ధృతి తీవ్రంగా ఉంది. క్షిణ కొరియాలో తాజాగా 148,417 కరోనా కేసులు నమోదయ్యాయి. 318 మంది ప్రాణాలు కోల్పోయారు. జర్మనీలో 160,914 కొవిడ్? కేసులు వెలుగుచూశాయి. 309 మంది మృతిచెందారు. ఫ్రాన్స్??లో తాజాగా 137,342 మంది వైరస్? సోకింది. మరో 133 మంది ప్రాణాలు కోల్పోయారు. ఆస్ట్రేలియాలో 53,426 కరోనా కేసులు 2

# బండిది ప్రజా వంచన యాత్ర

**జూటాకోరు పార్టీ.. దగకోరు యాత్ర**

**మండిపడుతూ బహిరంగ లేఖ రాసిన కెటిఆర్**

**హైదరాబాద్, ఏప్రిల్ 15 (అక్షర వెలుగు):** బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ చేపట్టిన ప్రజా సంగ్రామ యాత్రపై మంత్రికెటిఆర్ ఆఆగ్రహం వ్యక్తం చేశారు. అది ప్రజావంచన యాత్ర అన్నారు. దీనిపై మంత్రి కేటీఆర్ బహిరంగ లేఖ రాశారు. ఇది ముమ్మాటికీ ప్రజా వంచన యాత్ర అని.. జుటాకోరు పార్టీ అధ్యక్షుడు చేస్తున్న దగాకోరు యాత్ర అని వ్యాఖ్యలు చేశారు. పచ్చ బడుతున్న పాలమూరుపై కక్ష కట్టిన మీకు.. అక్కడ అడుగుబెట్టే హక్కులేదన్నారు. కృష్ణా జిలాల్లో తెలంగాణ వాటా తేల్చకుండా జలదోపిడికి జై కొడుతూ.. పాలమూరు రైతుకు ద్రోహం చేస్తున్న మీరు సిగ్గూ ఎగ్గూ లేకుండా యాత్రలు చేస్తారా అంటూ నిలదీసారు. పాలమూరుకు నీళ్లిచ్చే ప్రాజెక్టులపై బోర్డులు బెట్టి బోడిపెత్తనం చేస్తూ.. పండుతున్న పొలాలను ఎండబెట్టాలని కుట్రలు చేసిన వాళ్ళు ఇప్పుడు కపట యాత్రలు చేస్తారా?...పాలమూరు ఎత్తి పోతల పథకానికి జాతీయ హూదా ఎందుకు ఇవ్వలేదు?.. కర్ణాటక మీద కనికరం చూపిన మీరు పాలమూరు మీద కక్ష ఎందుకు ప్రదర్శిస్తున్నరో ... సమాధానం చెప్పాలి?.. అడుగడుగునా అన్యాయం... తెలంగాణ పుట్టకముందే కత్తిగట్టిన పార్టీ బీజేపీ అంటూ మంత్రి విరుచుకుపడ్డారు. విభజన హామీలు నెరవేర్చే తెలివిలేదు, నీతి ఆయోగ్ చెప్పినా నిధులిచ్చే నీతి లేదు. ప్రాజెక్టులకు జాతీయ హూదా ఇవ్వరు ఉచిత కరెంట్ ఇస్తుంటే మోటర్లకు మీటర్ల పెట్టమని బ్లాక్ మెయిల్ చేస్తారు. పండించిన పంటలు కొనకుండా రైతను గోస పుచ్చుకుంటారు. సందు దొరికితే చాలు తెలంగాణ మీద విషం గక్కుతారు . తెలంగాణ అంటేనే గిట్టని పార్టీ బీజేపీ అని మండిపడ్డారు. కడుపులో ద్వేషం పెట్టుకొని కపట యాత్రలు చేస్తే ఏం లాభం? అంటూ విమర్శలు 2



**ప్రజలకు వాతావరణశాఖ శుభవార్త**

**తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం** 2

**ఢిల్లీ గురుగ్రామ్‌లలో పెరుగుతున్నకేసులు**

**ఆందోళన కలిగిస్తున్న కేసుల సంఖ్య** 2

## తెలంగాణకుధాన్యం రాకుండా చెక్ పోస్టులు

**నల్గొండ, ఏప్రిల్ 15 (అక్షర వెలుగు):** తెలంగాణలోకి ఇతర రాష్ట్రాల నుంచి ధాన్యం రాకుండా సరిహద్దుల్లో పోలీసులు చెక్ పోస్టులు ఏర్పాటు చేశారు. మూడు షిఫ్టుల్లో చెక్ పోస్టుల వద్ద పోలీసు, రెవెన్యూ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. ఏపీ – తెలంగాణ సరిహద్దు సూర్యాపేట జిల్లా కోదాడ రామాపురం వద్ద చెక్ పోస్ట్ ఏర్పాటు చేశారు. జిల్లాలోని వాడపల్లి, నాగార్జున సాగర్ వద్ద చెక్ పోస్టులను ఏర్పాటు చేశారు. ఏపీ నుంచి తెలంగాణకు ధాన్యం రాకుండా తెలంగాణ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ధాన్యం రవాణా చేస్తున్న వాహనాలను పోలీస్, రెవిన్యూ సిబ్బంది తనిఖీ చేస్తోంది.

## తెలంగాణ ప్రతీ పథకంలోనూ కేంద్ర నిధులే

**బీజేపీ ప్రజా సంగ్రామ యాత్రలో కిషన్ రెడ్డి**



**జోగులాంబ గద్వాల, ఏప్రిల్ 15 (అక్షర వెలుగు):** తెలంగాణ ప్రతీ పథకంలోనూ కేంద్ర నిధులే ఉన్నాయని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. శుక్రవారం బీజేపీ ప్రజా సంగ్రామ యాత్ర భాగంగా అలంపూరు మండలం లింగనవాయి గ్రామంలో గ్రామస్థులతో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ చేపట్టిన మాటమంతి కార్యక్రమంలో కేంద్రమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ... పేద ప్రజల కోసం ఆయుష్మాన్ భారత్ పథకం అమలు చేస్తే నిజాందొర కేసీఆర్ తెలంగాణలో 2

## నగరంలో నేడు హనుమాన్ జయంతి శోభాయాత్ర

- గౌలీగుడా నుంచి తాడబన్ వరకు యాత్ర
- కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాటు చేసిన పోలీసులు
- మద్యం దుకాణాల మూసివేతకు ఆదేశాలు



**హైదరాబాద్, ఏప్రిల్ 15 (అక్షర వెలుగు):** హనుమాన్ జయంతి శోభాయాత్ర సందర్భంగా శనివారం హైదరాబాద్ నగరంలో పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. ఈ మేరకు నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు విధించినట్లు పోలీసులు తెలిపారు. హనుమాన్ శోభాయాత్ర గౌలిగూడ రామ్ మందిర్ నుంచి తాడ్‌బన్‌లోని హనుమాన్ మందిర్ వరకు కొనసాగనుంది. కర్మన్‌ఘాట్ హనుమాన్ టెంపుల్ నుంచి మరో యాత్ర కొనసాగనుంది. కర్మన్‌ఘాట్ నుంచి చంపాపేట్, కోఠి ఉమెన్స్ కాలేజ్, నారాయణగూడ మీదుగా తాడ్‌బన్‌లోని హనుమాన్ మందిర్ వరకు కొనసాగనుంది. గౌలిగూడ రామ్ మందిర్ వద్ద హనుమాన్ శోభాయాత్ర ఉదయం 11:30 గంటలకు ప్రారంభం కానుంది. పుత్లిబౌలీ ఎక్స్ రోడ్, 2

## దేశంలో వైద్యవిద్య బలోపేతం

- జిల్లాకో వైద్య కళాశాల నిర్మాణం
- భారీగా వైద్యుల నియామకాలు
- అందరికీ వైద్యవిద్య అందుబాటుకోసం కృషి
- గుజరాత్‌లో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ప్రారంభించిన మోడీ



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 15 (అక్షర వెలుగు):** దేశంలో వైద్యరంగాన్ని బలోపేతం చేస్తున్నామని, ఆసుపత్రుల నిర్మాణంతో పాటు,ఐవద్యుల నియామకం సాగుతోందని ప్రధాని మోడీ అన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి జిల్లాకు ఒక వైద్య కళాశాల పథకం వల్ల రానున్న పదేళ్లలో రికార్డు స్థాయిలో నూతన వైద్యులు రాబోతున్నారని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. అందరికీ వైద్య విద్య అందుబాటులో ఉండేలా ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. గుజరాత్‌లోని భుజ్ జిల్లాలో కేకే పటేల్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌ను ఆయన శుక్రవారం వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా ప్రారంభించారు. ఈ ఆసుపత్రి ప్రారంభం సందర్భంగా ఏర్పాటైన సభను ఉద్దేశించి మోదీ మాట్లాడుతూ, దేశంలోని ప్రతి జిల్లాలోనూ ఓ వైద్య కళాశాలను నిర్మించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తోందన్నారు. వైద్య విద్యను అందరికీ అందుబాటులోకి తీసుకొచ్చేందుకు కృషి జరుగుతోందన్నారు. వీటి వల్ల రానున్న పదేళ్ళలో మన దేశంలో కొత్తగా రికార్డు సంఖ్యలో డాక్టర్లు రాబోతున్నారని చెప్పారు. భుజ్ జిల్లాలో ప్రారంభమైన ఈ ఆసుపత్రి ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సంరక్షణ సేవలను అందుబాటు ధరలకు అందజేస్తుందన్నారు. రెండు దశాబ్దాల 2

## ముగిసిన పెండింగ్ చలాన్ల గడువు

**300 కోట్ల వరకు ఆదాయం వచ్చినట్లు ప్రకటన**



**హైదరాబాద్, ఏప్రిల్ 15 (అక్షర వెలుగు):** తెలంగాణలో ట్రాఫిక్ చలాన్ల క్లియరెన్స్‌కు భారీ స్పందన వచ్చింది. ఇప్పటివరకు 3 కోట్ల పెండింగ్ చలాన్లు క్లియర్ అయ్యాయి. పెండింగ్ చలాన్ల రూపంలో ప్రభుత్వానికి రూ.300 కోట్ల ఆదాయం వచ్చింది. 65 శాతంపైగా పెండింగ్ చలాన్లు వాహనదారులు క్లియర్ చేశారు. హైదరాబాద్‌లో 1.70 కోట్ల పెండింగ్ చలాన్లు క్లియర్ అయ్యాయి. 15వతేదీ శుక్రవారంతో చలాన్ల డిస్కౌంట్ ఆఫర్ ముగిసింది. మరోసారి ఆఫర్ పొడిగింపు ఉండదని పోలీస్ శాఖ తెలిపింది. పెండింగ్ చలాన్ వాహనదారులకు ట్రాఫిక్ పోలీసులు శుభవార్త తెలిపారు. పెండింగ్ చలాన్లు చెల్లించేందుకు భారీస్థాయిలో బిస్కౌంట్ ప్రకటించారు. టువీలర్ వాహనదారులకు 75 శాతాన్ని మాఫీ చేయబోతున్నట్లు ప్రకటించారు. కార్లకు 50 శాతం, బస్సులకు 30 శాతం చెల్లించేందుకు అవకాశం కల్పించారు. తోపుడు బండ్లకు 20 శాతం ఇచ్చారు. మార్చ్ ఒకటి నుంచి 30వ తేదీ వరకూ ఆన్‌లైన్, మీసేవా, ఆన్‌లైన్ గేట్‌వేల ద్వారా చెల్లింపునకు అవకాశం ఇచ్చారు. ఈ గడువు మార్చి 31తో ముగియనుండటంతో ప్రజల విజ్ఞప్తి మేరకు మరో 15 రోజుల పాటు పొడిగించారు. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పరిధిలో రూ.600 కోట్ల పైచిలుకు పెండింగ్ చలాన్లు ఉండటంతో వాటిని క్లియర్ చేసేందుకు ఈ కొత్త ప్రతిపాదన తీసుకొచ్చారు.

## ఆర్టీసీ మరోషాక్

- గుట్టుచప్పుడు కాకుండా రిజర్వేషన్ ఛార్జీల పెంపు

**హైదరాబాద్, ఏప్రిల్ 15 (అక్షర వెలుగు):** ప్రయాణికులకు టీఎస్ ఆర్టీసీ మరో షాకిచ్చింది. టికెట్ రిజర్వేషన్ చార్జీలు టీఎస్ఆర్టీసీ పెంచింది. ఒక్కో రిజర్వేషన్‌పై రూ.20 నుంచి 30 వరకు పెంచారు. అయితే చార్జీలు పెంచిన విషయాన్ని ఆర్టీసీ యాజమాన్యం దాచింది. మార్చి 27 నుంచే పెంచిన చార్జీలు అమల్లోకి వచ్చాయి. పెంచిన చార్జీలు అమల్లోకి వచ్చి మూడు వారాలు కావస్తున్నా టీఎస్ఆర్టీసీ అధికారిక ప్రకటన చేయకపోవడం గమనార్హం. పెంచిన చార్జీల వివరాలను ఆర్టీసీ యాజమాన్యం రహస్యంగా ఉంచడాన్ని ప్రయాణికులు తప్పుబడుతున్నారు.

## ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ ఎలక్ట్రిక్ టిప్పర్ ట్రయల్ రన్

- భారత్‌లో మొట్టమొదటి హెవీ డ్యూటీ టిప్పర్
- త్వరలో అత్యాధునిక సదుపాయాలతో హైదరాబాద్‌లో యూనిట్

**హైదరాబాద్, ఏప్రిల్ 15 (అక్షర వెలుగు):** ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ లిమిటెడ్ తన ఉత్పత్తి పోర్ట్‌ఫోలియోను ట్రక్ విభాగంలోకి విస్తరించే ప్రయత్నంలో భాగంగా 6X4 హెవీ డ్యూటీ ఎలక్ట్రిక్ టిప్పర్ ట్రయల్ రన్ శుక్రవారం నాడు విజయవంతంగా ప్రారంభించింది. ఎలక్ట్రిక్ బస్సుల తయారీలో అగ్రగామి, మార్కెట్ లీడర్‌గా ఉన్న ఒలెక్ట్రా ట్రక్కుల తయారీకి శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా 2

# సంపాదకీయం

## వ్యవసాయ విధానంపై చర్చించాలి

ప్రపంచ ఆకలి తీర్చడానికి భారతదేశం సిద్ధంగా ఉందని ప్రధాని మోడీ ఇటీవల ప్రకటించిన నేపథ్యంలో అందుకు తగ్గ కార్యాచరణ చేయాలి. ప్రపంచానికి సరిపడా ధాన్యం సరఫరా చేస్తామని, ఆహారధాన్యాలను సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉన్నామని అమెనికా అధ్యక్షుడుజో బైడెన్‌తో వర్చువల్ భేటీ సందర్భంగా చేసిన వ్యాఖ్యలు మన ఆహార సత్తాను చాటుతుందని చెప్పాలి. దేశంలో ఆహారధాన్యాల దిగుబడి పెరుగు తోంది. వాటిని నిల్వ చేసే సామర్థ్యం పెంచుకోవాలి. అలాగే రైతులకు గిట్టుబాటు ధరలు ఇవ్వగలగాలి. కరెంట్ సమస్యలు, ఎరువుల కొరత లేకుండా చేయాలి. ఇదే సందర్భంలో సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించుకోవాలి. దేశంలో నేటికీ అనేకమంది ఆకలితో అలమటిస్తున్నారు. తిండిగింజల ధరలు కూడా అందుబాటులో ఉండడంలేదు. అలాగే వంటనూనెల దిగుమతులను పూర్తిగా రద్దుచేసుకుని మనదేశంలోనే ఉత్పత్తి చేసుకోవాలి. ఇవన్నీకూడా వ్యవసాయాభివృద్ధితో ముడిపడి ఉన్న సమస్యలు. ప్రపంచానికి ఆహార ధాన్యాలు సరఫరా చేసేముందు దేశాన్ని వ్యవసాయికంగా సర్వసన్నద్ధంచేసుకోవాలి. ఇందుకు సంబంధించి మనకున్న వనరులు, వ్యవసాయదారులు, నీటి లభ్యత,కరెంట్ లభ్యత తదిరత అంశాలను చర్చించాలి. ప్రధాని మోడీ ఆహారధాన్యాల ఎగుమతులకు సిద్ధంగా ఉన్నారన్న విషయం స్పష్టం అయినందున ఇందుకు సంబంధించి అన్ని రాష్ట్రాల సిఎంలను విశ్వాసంలోకి తీసుకుని చర్చించాలి. అవసరమైతే సిఎంలతో ఒక ఉన్నతస్థాయి సమావేశం÷- ఏర్పాటుచేయాలి. ఆయా రాష్ట్రాల్లో పండే పంటల వివరాలను సేకరించాలి. దేశ ప్రజలకు అవసరమైన ఆహారాధాన్యలను సరసమైన ధరలకు అందించడంతో పాటు, ప్రపంచంలోని వివిధ దేశాలు ఎదుర్కొంటున్న ఆహార సమస్యలపైనా చర్చించాలి. ఇటీవల దేశమంతా ఒకే ధాన్యం సేకరణ విధానం ఉందని కేంద్రం ప్రకించింది. ధాన్యాన్ని విదేశాలకు ఎగుమతి చేసేందుకు ఎలాంటి ఆటంకాలు లేవని కూడా తెలిపింది. ఎంత అవసరమో అంతే తీసుకుంటాం.. ఎవరిపైనా వివక్ష లేదు. తెలంగాణలో గత ఐదేళ్లలో 7 రెట్ల ధాన్యం సేకరణ చేశాం. ధాన్యం సేకరణ, సంచుల అవసరంపై తెలంగాణ నుంచి ఎలాంటి ప్రతిపాదన రాలేదు. పంజాబ్ నుంచి పారా బాయిల్డ్ రైస్ తీసుకోలేవడం లేదని వివరణ ఇచ్చింది. అయితే ఇవి కేంద్ర రాష్ట్రానికి సంబంధించిన సమస్యలుమాత్రమే. ఇవన్నీ పక్కన పెట్టి కొత్త వ్యవసాయ విధానంపై చర్చించాలి. దీంతో దేశం మరింత పురోగతి చెందగలదు. బహుళ జాతి కంపెనీలకూ ఎర్ర తివాచీలు పరుస్తున్న ప్రభుత్వాలు రైతులను అనుత్పాదక రంగాలుగా చూస్తున్న తీరు దారుణం కాక మరోటి కాదు. విత్తనాలు, పురుగు మందుల వ్యాపారస్థుల దోపిడీ, నకిలీలతో రైతులను నిలువునా ముంచుతున్నారు. అధికారులు చోద్యం చూస్తున్నారు. బ్యాంకు అధికారులు, ఏజెంట్లు కలిసి రైతులకిచ్చే ఋణాలలో కోత పెడుతున్నారు. అడ్తిదారులు, కమీషన్ ఏజెంట్లు, మార్కెట్ అధికారులు, అంతిమంగా అందరూ రైతులను ముంచడానికే సిద్ధంగా ఉంటున్నారు. ఇకపోతే విదేశాల నుంచి నూనెల దిగుమతి వేరుశనగ రైతులకు శరాఘాతంగా మారింది. పంటల విధానంలో శాస్త్రీయ దృక్పథం లోపించడం, సేంద్రియ ఎరువుల బదులు రసాయన ఎరువులు వాడడంవల్ల భూసారం తగ్గుతోంది. ఏటా ఒక విధానంగా గాకుండా, రుణమాఫీలు అవసరం లేని విధంగా రైతులు స్వయం సమృద్ధిగా ఎదిగేలా చేయాలి. సస్యవిప్లవానికి నాందిపలకాలి. స్వాతంత్ర్యం లభించి 75సంవత్సరాలు కావస్తున్న సందర్భంగా ఆజాదీకి అమృతోత్సవం నిర్వహించు కుంటున్న సందర్భగా మోడీ విశాల దృక్పథంతో నిర్ణయాలు తీసుకోవాలి. ఈ ఆధునిక ఆర్థిక వ్యవస్థలో రైతుల సమస్యలు మరింత జఠిలం కాకుకుండా చూసుకోవాలి. దేశీయంగా అవసరమైన పంటలను పండించి, దేశ పౌరులకు కడుపునిండా భోజనం పెట్టగలగగాలి. మన అసవరాలకు సరిపడా కందులు, మిరప, నూనెగింజలతో సహా ఇతర పంటలను రైతులు చెమటోడ్చి పండించినా వాటిని కొనుగోలు చేయడం లేదు. రైతుల సమస్యలు రాజకీయ పక్షాలకు ప్రచార కార్యక్రమంగానే మిగిలిపోయాయి. పాలకపక్షం అయినా, ప్రతిపక్షం అయినా రైతుల సమస్యలను పరిష్కరించడానికి చిత్తశుద్ధితో ఆలోచించడం లేదు. గిట్టుబాటు ధరలు లేక వచ్చిన ఆదాయం కూలీల ఖర్చుకు సరిపోతుంది. ప్రతి ఎకరాకు కౌలు 10 వేల నుంచి 25 వేల రూపాయల వరకు భూమి యజమాను లకు చెల్లించవలసి వస్తుంది. మార్కెట్‌లో రైతును దోచుకునే శక్తులు నిరాటంకంగా విజృంభిస్తూనే ఉన్నాయి. రైతులకు గిట్టుబాటును మించి ధరలు దక్కేలా చేస్తామన్న ప్రధాని మోడీ కూడా తన వాగ్దానాన్ని నెరవేర్చు కోలేదు. వ్యవసాయ ఉత్పత్తి వ్యయాలు అనేక రెట్లు పెరిగిపోవడంతో పాటు విత్తనాల దగ్గర నుంచి నకిలీలు రైతులను కుంగదీస్తున్నాయి. చాలామంది రైతులు, కౌలుదారులు బ్యాంకు రుణాలు పొందలేకపోతున్నారు, ఈ క్రమంలో మోడీ స్వయంగా రంగంలోకి దిగి క్షేత్రస్తాయిలో సమస్యలు తెలుసుకోవాలి. అందుకు అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులను విశ్వాసంలోకి తీసుకుని చర్చించాలి. అప్పుడే దేశం వ్యవసాయకంగా పురోగ మించగలదు. మోడీ సంకల్పం కూడా నెరవేరగలదు.

**పృధ్విరాజ్ గోసుకొండ**
ఎడిటర్

## భారత న్యాయ వ్యవస్థ మరింత భలోపేతం

మొదటి పేజీ తరువాయి..) ఇదే తొలిసారని వెల్లడించారు. న్యాయ వ్యవస్థను బలపరిచేందుకు ఈ సమావేశం ఉపయోగపడు తుందన్నారు. ఇటీవల హైదరాబాద్ లో అంతర్జాతీయ ఆర్బిట్రేషన్ మీడియే షన్ సెంటర్ వచ్చిందని చెప్పారు. వివాదాల సత్వర పరిష్కారానికి ఈ కేంద్రం ఉపయోగ పడుతుంద న్నారు. తమ రాష్ట్రాల్లోనూ ఇలాంటి కేంద్రం ఏర్పాటు చేయాలని కోరుతున్నారని వెల్లడించారు. ఎనిమిదేండ్ల క్రితం అవతరించిన తెలంగాణ రాష్ట్రం అందరి సహకారంతో పురోగమి స్తున్నదని సీఎం కేసీఆర్ అన్నారు. చక్కటి ఆర్థిక క్రమశిక్షణతో అన్నిరంగాల్లో దూసుకుపోతు న్నామని చెప్పారు. విద్యుత్ రంగంలో అద్భుతమైన పురోగతి సాధిస్తున్నామని, వ్యవసాయ, పారిశ్రామిక రంగంలో ముందుకెళ్తున్నామన్నారు. పరిపాలన సంస్కరణలు తీసుకొచ్చి 33 జిల్లాలు ఏర్పాటు చేశామన్నారు. ఆర్‌బీఐ లెక్కల ప్రకారం తెలంగాణ తలసరి ఆదాయం రూ.2.78 లక్షలు అని చెప్పారు. తెలంగాణ రాష్ట్ర న్యాయ పరిపాలన విభాగం ఇంకా ముందుకెళ్లాలని, దేశానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. హైదరాబాద్ పట్ల జస్టిస్ ఎన్వీ రమణకు చాలా ప్రేమ ఉన్నదని చెప్పారు. సుదీర్ఘకాలం హైదరాబాద్‌లో పనిచేసినందున ఆయనకు అన్ని విషయాలు తెలుసున్నారు. హైకోర్టు విడిపోయిన తర్వాత బెంచీల సంఖ్య పెంచాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరినప్పటికీ పెండింగ్‌లో పెట్టారని చెప్పారు. అయితే సీజేఐ రమణ చొరవతో హైకోర్టు బెంచీలను 24 నుంచి 42కు పెంచారన్నారు. న్యాయ వ్యవస్థలో గతంలో 780 పోస్టులు మంజూరు చేశామని సీఎం కేసీఆర్ వెల్లడించారు. మరో 885 అదనపు పోస్టులు హైకోర్టుకు మంజూరు చేశామన్నారు. జిల్లా కోర్టులకు అదనంగా 1730 పోస్టులు మంజూరు చేశామన్నారు. జిల్లా కోర్టులలో పనిభారం ఉందని తెలిసిందన్నారు. 23 జిల్లాల్లో జిల్లా కోర్టు భవనాలు చేపడతామని వెల్లడించారు. రాష్ట్రంలో ఇప్పటివరకు కోటి 52 లక్షల ఎకరాల భూములను డిజిటలైజ్ చేశామన్నారు. రెవెన్యూ కోర్టులను ప్రభుత్వం రద్దు చేసిందని తెలిపారు. న్యాయమూర్తులు హోదాకు తగ్గట్లుగా 30 ఎకరాల్లో క్వార్టర్స్ నిర్మిస్తామని, సీజేఐ రమణతో శంకుస్థాపన చేయిస్తామన్నారు.

## ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ ఎలక్ట్రిక్ టిప్పర్ ట్రయల్ రన్

(మొదటి పేజీ తరువాయి..) రూపొందించిందే ఈ అంతర్నిర్మిత హెవీ-డ్యూటీ ఎలక్ట్రిక్ టిప్పర్. ఇది భారతదేశంలోనే మొట్టమొదటిది, సింగిల్ ఛార్జితో 220 కి.మీ. ప్రయాణం చేయవచ్చు. ఈ టిప్పర్ 25 శాతం డ్యూటీ బోగీ సస్పెన్షన్ గ్రేడబిలిటీ (ఎత్తైన రోడ్లూ, ఘాట్ రోడ్లు) కూడా కలిగి ఉంటుంది. త్వరలో హైదరాబాద్ శివార్లలో అత్యాధునిక సదుపాయాలతో కూడిన ఉత్పత్తి యూనిట్ ప్రారంభం కానుంది. ఈ సందర్భంగా ఒలెక్ట్రా గ్రీన్ టెక్ చైర్మన్- మేనేజింగ్ డైరెక్టర్ కెవి ప్రదీప్ మాట్లాడుతూ, “భారతదేశంలో ఎలక్ట్రిక్ మొబిలిటీలో అగ్రగామిగా ఉన్న, ఒలెక్ట్రా ఇప్పుడు హెవీ డ్యూటీ టిప్పర్ ట్రయల్స్‌ను ప్రారంభించింది. భారతదేశంలో ఈ రకమైన ట్రక్ ఇదే మొదటిది కావడం గర్వకారణం. పెట్రోల్, డీజిల్ ధరలు విపరీతంగా పెరుగుతుండటం తో, ఎలక్ట్రిక్ ట్రక్కులు ఈ రంగంలో గేమ్-ఛేంజర్‌గా మారతాయి. ఈ టిప్పర్ పనితీరు అద్భుతంగా, సమర్థవంతంగా ఉంటుంది. ఒలెక్ట్రా దీన్ని సాధ్యం చేసింది. ఇంతకు ముందు వాగ్దానం చేసినట్లు, మేము కలను సాకారం చేస్తున్నాం” అన్నారు.

## బండిది ప్రజా వంచన యాత్ర

(మొదటి పేజీ తరువాయి..) గుప్పించారు. వరిపంటతో రాజకీయ చలిమంటలు వేసుకోవాలని అన్నదాతను ఆగం చేయాలని పన్నాగం పన్నింది మీరు కాదా?... రైతులతో రాబందుల్లా వికృత రాజకీయం చేసి వడ్లను కొనమని అడిగితే చేతగాదని చేతులెత్తేసిన మీరు ఇప్పుడు మిడతల దండులా యాత్రకు బయల్దేరుతరా?... రైతు ద్రోహి.. రాష్ట్ర ద్రోహి పాత్ర పోషిస్తున్న మీకు పాదయాత్ర చేసే నైతిక హక్కు లేనేలేదు. తన పాదయాత్రకు రైతు ద్రోహ యాత్ర అనో లేక రైతు ధోకా యాత్ర అని పేరు పెట్టుకుంటే మంచిది. పాదయాత్ర కాదు.. మోకాళ్ల యాత్ర చేసి తెలంగాణకు ప్రజలకు క్షమాపణలు చెప్పాలని అంటూ మంత్రి కేటీఆర్ లేఖలో పేర్కొన్నారు.

## దేశంలో కొనసాగుతున్న టీకా పంపిణీ

(మొదటి పేజీ తరువాయి..) బయటపడ్డాయి. 45 మంది వైరస్‌కు బలయ్యారు.ఇటలీలో 64,951 కొవిడ్ కేసులు నమోదయ్యాయి. 149 మంది ప్రాణాలు కోల్పోయారు.

## ప్రజలకు వాతావరణశాఖ శుభవార్త

### తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం

**హైదరాబాద్, ఏప్రిల్ 15 (అక్షర వెలుగు):** ఎండలతో ఉక్కిరి బిక్కిరి అవుతున్న తెలంగాణ ప్రజలకు కాస్త ఉపశమనం కలిగించే వార్తను హైదరాబాద్ వాతావరణ కేంద్రం అందించింది. మొత్తంగా రాబోయే మూడు రోజుల్లో తెలంగాణలోని కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ శాఖ వెల్లడించింది. వర్షాల వల్ల ఉక్కపోత నుంచి ప్రజలు ఉపశమనం పొందే అవకాశం ఉంది. వర్షాలు కురిసే సమయంలో మెరుపులు, ఉరుములు సంభవించే అవకాశం ఉందని, 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచనున్నట్లు వాతావరణ శాఖ అధికారి శ్రావణి పేర్కొన్నారు. రాబోయే 24 గంటల్లో హైదరాబాద్‌లో ఆకాశం మేఘావృతమై ఉండనుంది. సాయంత్రం లేదా రాత్రి సమయాల్లో చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది. ఇక రాష్ట్ర వ్యాప్తంగా ఈ మూడు రోజులు అత్యధికంగా 39 డిగ్రీల సెల్సియస్, అత్యల్పంగా 29 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని శ్రావణి తెలిపారు. మండుటెండల నేపథ్యంలో జనాలు తమ నివాసాల నుంచి బయటకు వచ్చేందుకు జంకుతున్నారు. ఇంట్లోనే ఉంటే ఉక్కపోతతో ఇబ్బంది పడుతున్నారు. అటు ఇంట్లో ఉండలేని పరిస్థితి.. ఇటు బయట కాలు పెట్టలేని పరిస్థితి.

## ఢిల్లీ గురుగ్రామ్‌లలో పెరుగుతున్నకేసులు

### ఆందోళన కలిగిస్తున్న కేసుల సంఖ్య

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 15 (అక్షర వెలుగు):** దేశరాజధాని నగరమైన ఢిల్లీతోపాటు గురుగ్రామ్ నగరంలో కరోనా కేసుల సంఖ్య పెరుగుతుండటం ఆందోళనకు గురిచేస్తోంది. ఈ మధ్యకేసులసంఖ్య పెరుగుదల కనిపిస్తోంది. ఎన్సీఆర్ ప్రాంతంలో కొవిడ్ కేసులు పెరుగుతుండటంతో నాల్గవ వేవ్ ప్రారంభమైందని ఆరోగ్యశాఖ అధికారులు చెపుతున్నారు.గురుగ్రామ్ నగరంలో కరోనావైరస్ పాజిటివిటీ రేటు పెరిగింది. గురుగ్రామ్ నగరంలో కరోనా పాజిటివిటీ రేటు 8.5శాతం పెరిగింది. హర్యానా రాష్ట్రవ్యాప్తంగా బుధవారం నమోదైన మొత్తం 179 కొవిడ్ -19 కేసుల్లో 146 గురుగ్రామ్‌లోనే వెలుగుచూశాయి. దీంతో హర్యానా ఆరోగ్య శాఖ అప్రమత్తమైంది. కరోనా మహమ్మారి ఇకపై రాష్ట్ర బాధ్యత కాదని, వ్యక్తిగత వ్యక్తుల బాధ్యత అని ఇమ్యునాలజిస్ట్ సత్యజిత్ రాత్ అన్నారు. ఢిల్లీలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇమ్యునాలజీ చెందిన రాత్ ఈ వ్యాఖ్యలు చేశారు. మార్చి నెలలో ప్రపంచ ఆరోగ్య సంస్థ కొవిడ్ పరిమితులను ఎత్తివేయడం, మాస్కు ధరించాలనే ఆదేశాలను ఎత్తివేయడం,భౌతిక దూరాన్ని అంతం చేయడం ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న కేసులకు కారణమని తెలిపింది.ఢిల్లీలోనూ రోజువారీ కేసులలో అత్యధిక పెరుగుదల కనిపించింది. ఢిల్లీలో 2.39 శాతం సానుకూలత రేటుతో 325 తాజా కొవిడ్ -19 కేసులు నమోదయ్యాయి. కొంతమంది పాఠశాల విద్యార్థులకు కరోనా పాజిటివ్ అని తేలడంతో ప్రభుత్వం పాఠశాలలను మూసివేసింది.

## తెలంగాణ ప్రతీ పథకంలోనూ కేంద్ర నిధులే

(మొదటి పేజీ తరువాయి..) అడ్డుకుంటు న్నారని విమర్శించారు. తెలంగాణలో కుటుంబ, అహంకార పాలన పోవాలంటే బీజేపీ ప్రభుత్వం రావాలని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. బండి సంజయ్ రెండో విడత ప్రజా సంగ్రామ యాత్ర రెండో రోజు కొనసాగుతోంది.జోగులాంబ గద్వాల జిల్లా ఇమామ్ పూర్ నుంచి ఆలంపూర్ లోని ప్రాగటూరు వరకు యాత్ర కొనసాగనుంది. లింగన్ వాయి, బూడిదపాడు, ఉండవెల్లి, తక్కశిల, ప్రాగటూరు మీదుగా 13 కిలోమీటర్ల మేర యాత్ర సాగనుంది.పాదయాత్రలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, బీజేపీ నేత డీకే అరుణ పాల్గొన్నారు.

## నగరంలో నేడు హనుమాన్ జయంతి శోభాయాత్ర

(మొదటి పేజీ తరువాయి..) కోఠి ఆంధ్రా బ్యాంక్, రామ్ కోఠి ఎక్స్ రోడ్, కాచిగూడ ఎక్స్ రోడ్, వైఎంసీఏ, నారాయణగూడ ఎక్స్ రోడ్, ఆర్టీసీ క్రాస్ రోడ్స్, అశోక్ నగర్ క్రాస్ రోడ్స్, గాంధీ నగర్ టీ జంక్షన్, కవాడిగూడ ఎక్స్ రోడ్, సీజీవో టవర్స్, ఆర్పీ రోడ్, ఓల్డ్ పీఎస్ రామ్‌గోపాల్ పేట్, పారడైజ్ జంక్షన్, సీటీవో, బ్రూక్ బాండ్, మస్తాన్ కేఫ్ మీదుగా తాడ్‌బన్ హనుమాన్ మందిర్ వద్దకు రాత్రి 8 గంటలకు చేరుకోనుంది. ఈ మార్గాల్లో ట్రాఫిక్ మళ్లించనున్నారు. దిల్‌సుఖ్ నగర్ నుంచి మెహిదీపట్నం వెళ్లే వాహన దారులు ఎల్బీనగర్, ఉప్పల్, తార్నాక, సికింద్రాబాద్ లేదా ఎల్బీనగర్, చాంద్రాయణగుట్ట, ఆరాంఘర్, అత్తాపూర్ మీదుగా మెహిదీపట్నం చేరుకోవచ్చు. లక్డీకాపూల్ నుంచి సికింద్రాబాద్ స్టేషన్ లేదా ఉప్పల్ వెళ్లే వాహనదారులు.. వీవీ స్టాచ్యూ, సోమాజిగూడ, గ్రీన్ ల్యాండ్స్, బేగంపేట ఫ్లై ఓవర్, ప్రకాశ్ నగర్ ఫ్లై ఓవర్, పారడైస్ ఫ్లై ఓవర్ మీదుగా సికింద్రాబాద్, ఉప్పల్ చేరుకోవచ్చు. హనుమాన్ శోభాయాత్ర నేపథ్యంలో వాహనదారులు ట్రాఫిక్ పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ప్రత్యేక కంట్రోల్ రూమ్ (040 2785 2482) ట్రాఫిక్ హెల్ప్ లైన్ నంబర్ 9010203626ను ఏర్పాటు చేశారు. ఇదిలావుంటే హనుమాన్ జయంతి, శోభాయాత్ర నేపథ్యంలో హైదరాబాద్ నగరంలో మద్యం దుకాణాలపై పోలీసులు ఆంక్షలు విధించారు. శనివారం ఉదయం 6 గంటల నుంచి ఆదివారం ఉదయం 6 గంటల వరకు మద్యం దుకాణాలు మూసి ఉంటాయని పోలీసులు స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘించి మద్యం అమ్మేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

## దేశంలో వైద్యవిద్య బలోపేతం

(మొదటి పేజీ తరువాయి..) క్రితం గుజరాత్‌లో కేవలం తొమ్మిది వైద్య కళాశాలలు, 1,100 సీట్లు మాత్రమే ఉండేవన్నారు. నేడు 36 వైద్య కళాశాలలు, 6,000 సీట్లు ఉన్నాయన్నారు. 2001లో సంభవించిన భూకంపం వల్ల జరిగిన నష్టాన్ని గుర్తు చేసుకుంటూ, భుజ్, కచ్ ప్రాంతాల ప్రజలు తమ కఠోర శ్రమతో ఈ ప్రాంతానికి నూతన విధిని లిఖిస్తున్నారని చెప్పారు. నేడు ఈ ప్రాంతంలో చాలా ఆధునిక వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. భుజ్‌లో నేడు అత్యాధునిక, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి అందుబాటులోకి వచ్చిందన్నారు. మెరుగైన ఆరోగ్య సదుపాయాలంటే కేవలం వ్యాధులకు చికిత్స మాత్రమే కాదని, సామాజిక న్యాయం కూడా జరగాలని అన్నారు. ఓ నిరుపేద వ్యక్తికి చౌకగా, ఉత్తమ చికిత్స అందితే, ఈ వ్యవస్థపై ఆయన నమ్మకం బలపడుతుందన్నారు. శ్రీ కచ్చి లేవ పటేల్ సమాజ్ ఆధ్వర్యంలో కేకే పటేల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని నిర్మించారు. కచ్‌లో మొదటి చారిటబుల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఇదే. దీనిలో 200 పడకలు ఉన్నాయి. దీనిలో ఇంటర్వెన్షనల్ కార్డియాలజీ (క్యాత్‌ల్యాబ్), కార్డియోథొరాసిక్ సర్జరీ, రేడియేషన్ ఆంకాలజీ, మెడికల్ ఆంకాలజీ, సర్జికల్ ఆంకాలజీ, నెఫ్రాలజీ, యూరాలజీ, న్యూక్లియర్ మెడిసిన్, న్యూరో సర్జరీ, కీళ్ళ మార్పిడి, ఇతర సేవలు అందుబాటులో ఉంటాయి.

## ప్రాణహిత పుష్కరాల్లో అపశృతి

### నీటిలో మునిగి విశాఖవాసి మృతి

**మంచిర్యాల, ఏప్రిల్ 15 (అక్షర వెలుగు):** ప్రాణహిత పుష్కరాల్లో అపశ్రుతి చోటుచేసుకున్నది. మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలం అర్జునగుట్ట వద్ద పుణ్యస్నానం కోసం నదిలోకి దిగిన వ్యక్తి నీటిలో మునిపోయాడు. గుర్తించిన భక్తులు అధికారులకు సమాచారం అందించారు. దీంతో గజ ఈతగాళ్లు అతడిని బయటకు తీశారు. అయితే అతడు అప్పటికే మృతిచెందాని అధికారులు వెల్లడించారు. మృతుడిని విశాఖపట్నంకు చెందిన గుడ్ల సోమేశ్‌గా గుర్తించారు. మృతుని సబంధీకులకు సమాచారం అందించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రాణహిత పుష్కరాలకు భక్తుల తాకిడి పెరిగింది. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌నుంచి పుణ్య స్నానాలు చేయడానికి ఎక్కువగా తరలివస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు, ఏలూరు, నెల్లూరు ప్రాంతాల నుంచి రైళ్లు, ప్రత్యేక వాహనాల్లో తరలివచ్చి తమ పెద్దలకు పిండప్రదానం నిర్వహించి పుణ్యస్నానాలు ఆచరిస్తున్నారు. కాగా దుకాణాలకు టెండర్లు నిర్వహించిన అధి కారులు విద్యుత్ కనెక్షన్‌లు ఇవ్వకపోవడంతో దుకాణం దారులు ఆందోళనకు దిగారు. చీకట్లో ఉంటున్నామని ఆందోళనకు దిగడంతో రేపటి లోగా సమస్య పరిష్కరిస్తామని అధికారులు తెలిపారు. ఈ పుష్కరాలకు ఆఖరి మూడు రోజులు కాశి దేవాలయం నుంచి వేదపండి తులు గంగాహారతికి రానున్నట్లు ఎమ్మెల్యే కోనేరుకోనప్ప తెలిపారు.

## వ్యాక్సిన్ క్యాపిటల్ ఆఫ్ వరల్డ్‌గా తెలంగాణ

- మెడికల్ డివైస్ పార్కులో ఎస్ఎంటీ సంస్థ
- ప్రారంభించిన మంత్రి కెటిఆర్




**సంగారెడ్డి, ఏప్రిల్ 15 (అక్షర వెలుగు):** తెలంగాణ వ్యాక్సిన్ క్యాపిటల్ ఆఫ్ వరల్డ్‌గా మారిందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. వైద్యోపకరణాల తయారీ, పరిశోధనల కోసం హైదరాబాద్‌కు ప్రాధాన్యం పెరిగిందన్నారు. సంగారెడ్డి జిల్లాలోని సుల్తాన్‌పూర్‌లోని మెడికల్ డివైస్ పార్కులో సహజానంద్ మెడికల్ టెక్నాలజీ(ఎస్ఎంటీ) సంస్థను ప్రారంభించారు. ప్రాజెక్టు సంజీవని పేరుతో స్టెంట్ల తయారీ యూనిట్‌ను ఎస్ఎంటీ సంస్థ ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ.. కరోనాతో ప్రపంచం వెనుకబడినా ఎస్ఎంటీ వేగం తగ్గలేదు. ఆసియాలోనే అతిపెద్ద స్టెంట్ల తయారీ, పరిశోధన సంస్థ ఎస్ఎంటీ అని కొనియాడారు. దేశంలో మెడికల్ డివైసెస్ తయారీతో ఔషధాలు, వైద్యోపకరణాల ధరలు తగ్గాయి. బయో ఆసియా సదస్సులో వైద్యోపకరణాల తయారీ సంస్థలను కలిశానని గుర్తు చేశారు.

# శ్రీ చరణ్... సేవలో సరిలేరు నీకెవ్వరు

- సర్కార్ బడుల అభివృద్ధియే ఆయన లక్ష్యం
- పేద విద్యార్థులకు అండగా నిలుస్తున్న కస్తూరి ఫౌండేషన్
- లక్షలాది రూపాయలతో ఎన్నో సేవా కార్యక్రమాలు

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్న అనేక మంది ప్రస్తుతం ఉన్నత స్థానంలో ఉన్నారు. వీరిలో కొందరు మాత్రమే చదువుకున్న పాఠశాలల అభివృద్ధికి చేయూతనిస్తున్నారు. అనేక సమస్యలతో సతమతమవుతున్న పాఠశాలలకు అండగా నిలుస్తూ,లక్ష్మీ కటాక్షం లేని సరస్వతి పుత్రులకు ఆర్థికంగానూ చేయూతనిస్తున్నారు.

కస్తూరి ఫౌండేషన్ వ్యవస్థాపకులు

- శ్రీ చరణ్ పై 'అక్షర వెలుగు' ప్రత్యేక కథనం





శ్రీ చరణ్
కస్తూరి ఫౌండేషన్ వ్యవస్థాపకులు



### 2017లో కస్తూరి ఫౌండేషన్ ఏర్పాటు

కస్తూరి శ్రీ చరణ్ పది మంది స్నేహితులతో కలిసి 2017 జూన్ 22 న కస్తూరి ఫౌండేషన్ ను స్థాపించారు. నాటి నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు మెరుగు పరచడంతో పాటు పేద, మధ్య తరగతి విద్యార్థులకు చేయూతనిస్తున్నారు.ప్రభుత్వ బడుల్లో సరైన వసతులు లేవనే కారణంతో విద్యార్థి చదువులకు దూరం కాకూడదనే ఉద్దేశంతో శిథిలావస్థకు చేరిన పాఠశాల భవనాలకు మరమ్మతులు, మూత్రశాలలు, మరుగుదొడ్లు వంటి వసతులు కల్పిస్తున్నారు.దీనికి తోడు పాఠశాలలకు ఎల్.సి.డి ప్రొజెక్టర్లు, సౌండ్ సిస్టం వంటి పరికరాలను అందజేస్తున్నారు. ఏటా విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌తో పాటు చదువులో ప్రతిభ కనబరిచిన వారికి నగదు ప్రోత్సాహకాలు ఇస్తున్నారు.

### ఉమ్మడి నల్లగొండ జిల్లాలో కస్తూరి ఫౌండేషన్ సేవలు

పదో తరగతిలో ఉత్తీర్ణత శాతం పెంచేందుకు 20 వేల మంది విద్యార్థులకు రూ.40 లక్షలతో స్టడీ మెటీరియల్స్ అందజేశాడు. 105 ప్రభుత్వ పాఠశాలల్లో రూ.66 లక్షలతో 22 వేల మంది విద్యార్థులకు స్టడీ కిట్లు పంపిణీ చేశారు. వాటర్ బాటిల్,పరీక్ష ప్యాడ్,8 నోట్ పుస్తకాలు,పెన్నులు ఇతర సామాగ్రితో కూడిన బ్యాగును ఈ విద్యా సంవత్సరం 25 వేల మందికి స్టడీ కిట్లు అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. 100 ప్రభుత్వ పాఠశాలలకు రూ. 40 వేలతో ప్రథమ చికిత్స పరికరాలను అందజేశారు.పలు ప్రభుత్వ పాఠశాలలకు రూ. 47 లక్షలతో 12 ఎల్.సి.డి ప్రొజెక్టర్లు,150 స్టడీ చైర్లు,150 ఫ్యాన్లు,ట్యూబ్ లైట్లు,25 సౌండ్ సిస్టంలు,తరగతి బోర్డులు,800 డెస్క్ బెంచీలు అందజేశాడు. పది పాఠశాలలకు రూ.4 లక్షల విలువైన క్రీడా సామాగ్రిని అందించారు. పలివెల ఉన్నత పాఠశాల మరమ్మతులకు రూ.2 లక్షలు,నాంపల్లి ఉన్నత పాఠశాల మూత్రశాలలకు రూ. 1.30 లక్షలు,ప్రాథమిక పాఠశాల పునర్నిర్మాణం, కొప్పోలు మండల పరిషత్ పాఠశాల పునర్నిర్మాణం, వేదిక ఏర్పాటుకు రూ.12 లక్షల 40 వేలు ఖర్చు చేశారు.ప్రస్తుతం రూ.6 లక్షలతో మునుగోడు ప్రాథమిక పాఠశాల ఆధునీకరణ పనులు జరుగుతున్నాయి.

### పేద విద్యార్థులకు అండగా ఫౌండేషన్

ఆర్థిక చేయూత లేని 50 మంది పేద విద్యార్థుల ఉన్నత చదువులకోసం రూ.20 లక్షలు అందజేశాడు.పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన 60 మంది విద్యార్థులకు నగదు ప్రోత్సాహకంగా రూ.4 లక్షలు ఇచ్చాడు.గత విద్యా సంవత్సరం జవహర్ లాల్ నెహ్రూ జాతీయ మెమోరియల్ సైన్స్ కు వెళ్లేందుకు మునుగోడు మండలంలోని హైస్కూల్ విద్యార్థులు శివలింగం, అనిల్ కుమార్‌లకు రూ.20 వేలు ప్రయాణ ఖర్చులకు అందించారు. మునుగోడు మండలం ఇప్పర్తి గ్రామంలోని తల్లిదండ్రులను కోల్పోయి అనాథలైన చిన్నారులకు బియ్యంతో పాటు,నిత్యవసర వస్తువులను దుప్పట్లను పంపిణీ చేసి,వారి ఉన్నత చదువులకు అయ్యే ఖర్చులను తానే భరిస్తానని హామీ ఇచ్చారు.

### కరోనా సమయంలోనూ.....

కరోనా మహమ్మారి విజృంభిస్తున్న ప్రస్తుత తరుణంలోనూ కస్తూరి ఫౌండేషన్ ద్వారా సేవా కార్యక్రమాలు నిరాటంకంగా నిర్వహిస్తున్నారు. ఇటీవల ప్రభుత్వ పాఠశాలలు పునః ప్రారంభం కాగానే మునుగోడు మండలం జడ్పీహెచ్ఎస్ లో 122 మందికి, కొప్పోలు జడ్పీహెచ్ఎస్ 45 మందికి నోట్ పుస్తకాలు, మాస్కులు, ఇతర సామగ్రితో కూడిన స్టడీ కిట్లను అందజేశారు. మునుగోడు కొప్పోలు చెప్పారు పాఠశాలలకు ఐదు లీటర్ల చొప్పున పంపిణీ చేశారు.

### అందరికీ విద్య అందించడమే మా ఆకాంక్ష

మానవ మనుగడకు గాలి, నీరు, నింగి, భూమి లాగే చదువు కూడా అవసరమని నా అభిప్రాయం. అందుకే అందరికీ విద్య అందించాలనే ఆకాంక్షతోనే కస్తూరి ఫౌండేషన్ స్థాపించాము. బడుగు, బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులు ఎక్కువగా చదివే ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు మా వంతుగా తోడ్పాటునందిస్తున్నాం. మా ఫౌండేషన్ నిర్వహించే సేవా కార్యక్రమాలను ఇతరులు సైతం ఆదర్శంగా తీసుకొని పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తే మేము గర్విస్తాం.

## సిద్ధిపేట పట్టణం బాబు జగ్జీవన్ రావు భవన్లో పోలీస్ నియామకాల గురించి నిర్వహిస్తున్న

### పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత ఐపీఎస్



**సిద్ధిపేట, 15 ఏప్రిల్ (అక్షర వెలుగు):** శుక్ర వారం పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్ సిద్దిపేట పట్టణం (బిజెఆర్) బాబు జగ్జీవన్ రావు భవన్లో పోలీస్ నియామకాలకు గురించి నిర్వహిస్తున్న ఉచిత పోలీస్ శిక్షణ శిబిరాన్ని సందర్శించారు. ఈ సంద ర్భంగా శిక్షణ పొందుతున్న యువతీ యువకులను ఏమైనా సమస్యలు ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు, యువతీ యువకులు మాట్లాడుతూ ఎలాంటి సమస్యలు లేవని శిక్షణ బాగుందని మరియు భోజన సదుపాయాలు బాగున్నాయని కమిషనర్ మేడమ్ గారికి తెలిపినారు. కమిషనర్ మేడమ్ మాట్లాడుతూ అభ్యర్థులు ప్రతి రోజూ ఉదయం 9 గంటల లోపు శిక్షణా కేంద్రానికి చేరుకోవాలని, 70 రోజుల్లో ఏ ఒక్క రోజు కూడా ఆబ్సెంట్ కావద్దని అభ్యర్థులకు సూచించారు, త్వరలో విడతలవారీగా ఫిజికల్ శిక్షణ ఇవ్వడానికి ప్రణాళికలు తయారు చేయడం జరిగిందన్నారు. ఫ్యాకల్టీ చెప్పే ప్రతి అంశాన్ని నోట్ చేసుకుని మళ్లీ ఇంటికి వెళ్ళగానే రివైజ్డ్ చేసుకోవాలని సూచించారు. ఉదయం నుండి సాయంత్రం వరకు ప్రతి అభ్యర్థి ఉండాలని సూచించారు. వరుసగా రెండు మూడు రోజులు గైర్హాజరైన అభ్యర్థులను శిక్షణ కేంద్రం లోనికి అనుమతించమని తెలిపారు. మంత్రివర్యులు తన్నీరు హరీష్ రావు గారి సహాయ సహకారాలతో ఎంతో డబ్బులు కర్చు చేసి శిక్షణ ఇస్తున్నామని దీనిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని, క్రమశిక్షణతో ఉద్యోగం సాధించాలని సూచించారు, సెల్ఫోన్లకు, వాట్సాప్, చాటింగ్, సినిమాలకు షికార్లకు దూరం ఉండాలని, మీ భవిష్యత్ ఇప్పుడు మీ చేతుల్లోనే ఉంది దాన్ని అందంగా తీర్చిదిద్దుతారో లేదా అనేది మీరు తీసుకునే నిర్ణయాన్ని బట్టి ఉంటుందని, మీరు అనుకున్నది చేసి విజయం సాధించగలిగితే మీ కుటుంబం లేదా మీ మిత్రబృందంలో ఒకరిద్దరు మీ అడుగుజాడలలో నడుస్తారు, మీరు చదువు పై మనసు కేంద్రీకరించి సినిమాలు ప్రేమలకు తక్కువ ప్రాధాన్యత ఇస్తే అనుకున్న ప్రకారం మీ జీవితంలో పైకి వస్తారు, పుస్తకాలు నిజమైన దేవుళ్ళు మనం కోరుకున్న వరాలు ఇస్తాయి, అవి మనల్ని అడుగడుగునా ఆశీర్వదిస్తాయి. చదువంటే కష్టపడి చదవద్దు, ఇష్టపడి చదవండి దీనివల్ల ఆత్మవిశ్వాసం పెరుగుతుంది నిరుత్సాహం నిరాశనుండి బయటపడి విజయం సాధిస్తారు, మీ జీవితంలో విజయం సాధించాలంటే అన్ని అవకాశాలు మీ చుట్టూ ఉన్నాయి, మీ మైండ్ సెట్ ను మార్చుకుని మిమ్ములను మీరు పూర్తిగా నమ్మి పాత ఆలోచనలకు స్వస్తి చెప్పి కొత్త కోణంలో ఆలోచించండి విజయం మీదే, కలలు కనండి వాటిని సాకారం చేసుకోండి మేధావులంతా పల్లెల్లోనే పెరిగినవారే, మీరు విజయం సాధించాలంటే నిజాయితీ, విశ్వసనీయత, అంకితభావం, ప్రేరణ, దృఢమైన వైఖరి, లక్ష్యం పై గురి, ఆత్మ పరిశోధన, శారీరక స్థితి, సామాజిక స్పృహ, విజ్ఞానము, మానసిక స్థితి, సృజనాత్మకత, భావావేశాలు, కలిగి ఉండాలని కమీషనర్ గారు తెలిపినారు. పూర్తి పారదర్శకంగా మెరిట్ ప్రకారమే పోలీస్ సెలక్షన్స్ జరుగుతాయన్నారు, హైదరాబాద్ లో ప్రయివేట్ కోచింగ్ సెంటర్లలో ఇచ్చే కోచింగ్ కంటే ఉన్నత శిక్షణా ఇస్తున్నాం, బాగ్యకిరణ్ ఇన్స్టిట్యూట్ హైదరాబాద్ వారిచే సుశిక్షితులైన ఉపాధ్యాయులచే శిక్షణనిస్తున్నట్లు తెలిపినారు. ఉద్యోగం వస్తే మీకు మీ కుటుంబానికి సమాజంలో గౌరవం వస్తుందని సూచించారు, కళ్ళు మూసిన కళ్ళు తెరిచిన కానిస్టేబుల్ ఉద్యోగమే కనపడాలని కష్టపడి 70 రోజులు చదివితే 30 సంవత్సరాలు ఉద్యోగం చేసుకొని భార్య పిల్లలను తల్లిదండ్రులను ఎలాంటి లోటు లేకుండా చూసుకోవచ్చున్నారు. ఇంత మంచి అవకాశం మళ్లీ రాకపోవచ్చని వచ్చిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మరియు మీయొక్క (కలలు) డ్రీమ్స్ నెరవేర్చుకోవచ్చుని మేడమ్ గారు తెలిపినారు. ఈ కార్యక్రమంలో లో సిద్దిపేట ఏసిపి దేవారెడ్డి 2 టౌన్ ఇన్స్పెక్టర్ రవికుమార్, మహిళా ఎస్ఐ స్రవంతి, పోలీస్ సిబ్బంది మరియు తదితరులు పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన టిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నారా బోయిన రవి ముదిరాజ్




**మునుగోడు, ఏప్రిల్ 15 (అక్షర వెలుగు):** మునుగోడు మండల కేంద్రంలో ధనలక్ష్మి ఫంక్షన్ హాల్ లో రామకృష్ణాపురం చెందిన గుండె అంజయ్య యాదవ్ కుమార్తె గౌతమ్ వెంకటేష్ యాదవ్ వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన టిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు నారా బోయిన రవి ముదిరాజ్ ఈ కార్యక్రమంలో శాంతినికేతన్ హై స్కూల్ ప్రిన్సిపాల్ నన్నూరి నర్సిరెడ్డి టిఆర్ఎస్ పార్టీ యువజన నాయకులు జంగిలి నాగరాజ్ నాయకులు బండారు మల్లేష్ కట్ట రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఈ నెల 22 న ములకలపల్లిలో జరిగే కుంజా లక్ష్మణరావు సంతాప సభను విజయవంతం చేయండి

### న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఆవునూరి మధు




**భద్రాద్రి కొత్తగూడెం, ఏప్రిల్ 15(అక్షర వెలుగు):** ఈ నెల 22న ములకలపల్లి మండల కేంద్రంలో, సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కమిటీ సభ్యుడు అమరుడు కామ్రేడ్ కుంజా లక్ష్మణరావు సంతాప సభ కు న్యూడెమోక్రసీ శ్రేణులు, శ్రేయోభిలాషులు, మిత్రులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని, సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఆవునూరి మధు పిలుపునిచ్చారు. శుక్రవారం కామ్రేడ్ లక్ష్మణరావు సంతాపసభ కరపత్రాలను పాల్వంచ పట్టణంలోని న్యూడెమోక్రసీ కార్యాలయంలో ఆవిష్కరించారు. అనంతరం వంకా సురేష్ అధ్యక్షతన జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆవునూరి మధు మాట్లాడుతూ.. కామ్రేడ్ కుంజా లక్ష్మణరావు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలై ఖమ్మం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడని అన్నారు. కామ్రేడ్ లక్ష్మణరావు 90వ దశకం చివరిలో పార్టీ పూర్తి కాలం కార్యకర్తగా జీవితాన్ని ఎంచుకొని, ములకలపల్లి మండలం లో న్యూడెమోక్రసీ ఆర్గనైజర్ గా ప్రజల తలలో నాలుకలా పనిచేశాడని, పోడు భూములు ఆదివాసీ పేదలు సాగు చేసుకునేందుకు పోరాట కర్తవ్యాలను రూపొందించడం తో పాటు , వాటిని అమలు చేయడంలోనూ అగ్రభాగాన నిలిచాడని కొనియాడారు. ములకలపల్లి మండలం పొగళ్లపల్లి నారాయణరావు భూస్వామీపై పార్టీ ఆధ్వర్యంలో జరిగిన పోరాటంలో క్రియాశీల పాత్ర పోషించాడని పేర్కొన్నారు. అనేక నిర్బంధాలను, కేసులను సైతం ఎదుర్కొని, అనేకసార్లు జైలుకు వెళ్లాడని తెలిపారు. ఈ ప్రాంతంలో ప్రజల మధ్య వచ్చే సమస్యలను ఎంతో నేర్పుతో పరిష్కరించే వాడని తెలిపారు. పార్టీ నిర్మాణ సూత్రాలకు కట్టుబడి, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ విప్లవ రాజకీయాలను దృఢ విశ్వాసంతో బలపరిచాడని అన్నారు. అందరితో స్నేహపూర్వకంగా కలిసిపోయి, నిరాడంబరంగా కమ్యూనిస్టు ఆదర్శాలను పాటించాడని గుర్తు చేశారు. కామ్రేడ్ లక్ష్మణరావు మరణం న్యూడెమోక్రసీ పార్టీ కి తీరని లోటు అన్నారు. ఆ కామ్రేడ్ నమ్మిన న్యూడెమోక్రసీ ప్రతిఘటన పోరాట విప్లవ రాజకీయాలను ముందుకు తీసుకుపోయేందుకు, ప్రతి కార్యకర్త , న్యూడెమోక్రసీ శ్రేణులు కృషి చేయాలని, ఆ అమరుడి ఆశయాలను స్మరించుకుంటూ, ఈ నెల 22న ములకలపల్లి మండల కేంద్రంలో జరగనున్న కామ్రేడ్ లక్ష్మణరావు సంతాప సభ కు, న్యూడెమోక్రసీ శ్రేణుల తో పాటు, శ్రేయోభిలాషులు, ప్రజాస్వామిక వాదులు, మిత్రులు అందరూ హాజరై, విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో న్యూడెమోక్రసీ డివిజన్ నాయకులు మోరా రవి, ఐ ఎఫ్ టి యు జిల్లా ఉపాధ్యక్షులు గౌని నగేశ్, అఖిలభారత రైతుకూలి సంఘం జిల్లా కోశాధికారి జక్కుల రాంబాబు, ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా నాయకురాలు ఉమా, పార్టీ ములకలపల్లి మండల నాయకులు వంకా సురేష్, తాటి తిరుపతయ్య, ఆదినారాయణ, ముదిగొండ మల్లయ్య, పొడుగు నరసింహారావు, ప్రసాద్, రమేష్, అఖిల భారత రైతుకూలీ సంఘం నాయకులు వైయస్ రెడ్డి, బద్రు, దూలయ్య తదితరులు పాల్గొన్నారు

## దళిత బంధు ప్రతి ఒక్కరికి వచ్చే విధంగా రాష్ట్రంతో కొట్లాడుత

### ఎంపిపి మంద జ్యోతి పాండు



**కందుకూరు, ఏప్రిల్ 15(అక్షర వెలుగు):** రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం పరిధిలో శుక్రవారం కందుకూర్ మండలంలోని నాలుగు గ్రామాలకు సంబంధించి దళిత బంధు పథకం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి వర్యులు సబితా ఇంద్రారెడ్డి మరియు రంగారెడ్డి జిల్లా పరిషత్ చైర్మన్ అనిత హరినాథ్ రెడ్డి తో కలిసి కందుకూరు మండల ఎంపిపి మంద జ్యోతి పాండు ట్రాక్టర్లను పంపిణీ చేయడం జరిగింది. తెలంగాణ రాష్ట్రంలో దళిత బంధు ప్రతి ఒక్కరికి వచ్చే విధంగా కృషి చేస్తానని, త్వరలోనే ప్రతి ఒక్క దళితులకి దళిత బందు వచ్చే విధంగా తెలంగాణ రాష్ట్రం కృషి చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి బొక్క జంగా రెడ్డి, వైస్ ఎంపీపీ గంగుల షామంత ప్రభాకర్ రెడ్డి మరియు వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే వేడుకలు



**నాగార్జునసాగర్, ఏప్రిల్ 15 (అక్షర వెలుగు):** నాగార్జున సాగర్లో శుక్రవారము గుడ్ఫ్రైడే వేడుకలను క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పైలాన్ కాలనీ, హిల్ కాలనీ లోని చర్చిల లో ఉదయ్ నుండి సాయంత్రం వరకు ప్రత్యేక ప్రార్థనలు, క్రైస్తవులు గుడ్ఫ్రైడే సందర్భంగా ఉపవాస దీక్షలతో ప్రార్థనల్లో పాల్గొన్నారు, హిల్ కాలనీ లోని లూథరన్ చర్చి లో జరిగిన కార్యక్రమంలో చర్చి పాస్టర్ ఎడ్ల రాజేశ్వరరావు ఏసుక్రీస్తుసిలువలో పలికిన ఏడు మాటలను సంఘ సభ్యులు ఏడుగురు ఈ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. వారు ఇందిరా వేదవతి నక్క పీటర్ బండి శాంసన్ రెవరెండ్ ఎ డి వి కె ప్రసాద్ ప్రియాంక సునీత అనిత సంఘ పెద్దలు గుండె కోటేశ్వరరావు శేఖర్ లూథర్ విజయ్ కాంతారావు కుమారి క్రాంతి మయి తదితరులు పాల్గొన్నారు.

## నిబంధనల్ని గాలికి వదిలేసిన సినిమా టాకీస్ యజమానులు



**వికారాబాద్, ఏప్రిల్ 15 (అక్షర వెలుగు):** వికారాబాద్, ఏప్రిల్ 15 అక్షర వెలుగు న్యూస్ : వికారాబాద్ జిల్లా కేంద్రంలోని సినిమ్మా థియేటర్ క్యాంటీన్లో నిబంధనలకు విరుద్ధంగా తిను బండారాలను అధిక ధరలకు అమ్ముతున్నారు. వినోదాల పేరిట ప్రేక్షకుల జేబులకు చిల్లులు కొడుతున్నారు. వాటర్ బాటిల్ ఎమ్మార్పీ 20 రూపాయలు ఉండగా 30 రూపాయలకు విక్రయిస్తున్నారు. చూడవా మిక్చర్ ప్యాకెట్లు 20 రూపాయలు ఉండగా 30 రూపాయలకు విక్రయిస్తున్నారు, ఇదిలా ఉంటే బైక్ పార్కింగ్ మాత్రం ఇష్టారాజ్యంగా రోడ్డు పక్కన పార్కింగ్ చేస్తున్నారు. బడప ఉన్నోడి దే బర్రె అన్నట్టు, తెలంగాణ రాష్ట్రంలో దోచుకున్నోడికి దోచుకున్నంత అన్నట్లుగా ఉంది. డబ్బులు ఉన్నోడు ఏది చెబితే అదే, ఆడిందే ఆట పాడిందే పాట, అన్నట్లుగా ఉంది, అధికారంలో ఉన్న వాళ్లదే ఆట, పాట, ఏసీలు, ఫ్యాన్లు పనిచేయక ఇబ్బందికరంగా ఉందని ప్రేక్షకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పార్కింగ్ స్థలంలేందే సినిమా ఆల్కి పర్మిషన్ ఎలా ఇస్తున్నారని అసలే ఎండలు మండిపోతున్నాయి అని ఈ సినిమాకు వెళ్ళిన ప్రేక్షకులు వాహనాలు ఎండలో పెడితే ప్రమాదవశాత్తు తగలబడి పోతే ఎవరు బాధ్యులు అని సినిమా ప్రేక్షకులు వాపోతున్నారు. కనుక సంబంధిత అధికారులు ఒక్కసారి తనిఖీలు చేసి నిఘా పెట్టి తగిన చర్యలు తీసుకోవాలని సినిమా చూడటానికి వచ్చిన ప్రేక్షకులు కోరుతున్నారు.

## కరెంటు కోతలపై రైతుల నిరాహారదీక్ష



**ములుగు, ఏప్రిల్ 15 (అక్షర వెలుగు):** గోవిందరావుపేట మండల కేంద్రంలోని రైతులు కష్టపడి పండించిన పంట చేతికొచ్చే సమయంలో విద్యుత్ కోతలతో తల్లడిల్లుతున్న ప్రభుత్వ యంత్రాంగం పట్టించుకోవడంలేదని నిరసన వ్యక్తం చేస్తూ గోవింద పేట మండల కేంద్రంలోని విద్యుత్ సబ్ స్టేషన్ నందు రైతు సూరపనేని వెంకట సురేష్ గారి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున రైతులు గత రాత్రి 8 గంటల నుండి నిరాహార దీక్షను ప్రారంభించడం జరిగింది ఈ యొక్క దీక్ష కార్యక్రమానికి భారతీయ జనతాపార్టీ ములుగు జిల్లా పూర్తి మద్దతు తెలుపుతూ పాల్గొనడం జరిగింది ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షులు చింతలపూడి భాస్కర్ రెడ్డి గారు బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి తాటి కృష్ణ గారు దీక్ష లో పాల్గొని మాట్లాడుతూ గత నెల రోజుల నుండి కరెంట్ ఎప్పుడు వస్తుందో ఎప్పుడు పోతుందో తెలియదు రైతులు నానా గోస పడుతున్నారని రైతులు కష్టపడి పండించిన పంట చేతికొచ్చే సమయంలో విద్యుత్ అధికారుల సమన్వయ లోపంతో రైతుల పాలిట యమ పాశం గా మారారని వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్ ఇస్తామని చెబుతున్న ప్రభుత్వం కనీసం ఏడు గంటల కరెంటు కూడా ఇవ్వలేక రైతులను ఇబ్బంది పాలు చేయడం కెసిఆర్ పాలన వైఫల్యానికి నిదర్శనమని అన్నారు కెసిఆర్ సొంత నియోజకవర్గమైన గజ్వేల్ లో రైతులకు 24 గంటల విద్యుత్ సరఫరా అందిస్తూ మిగతా నియోజకవర్గాలకి కరెంట్ కోతలు విధించడం రైతుల పట్ల సవతి తల్లి ప్రేమ చూపిస్తున్నదని అన్నారు దీనితో స్థానిక సీఐ గారు విద్యుత్ పై అధికారులతో సంప్రదింపులు జరిపి సబ్ స్టేషన్ ఏ ఈ గారిని వెంట తీసుకుని దీక్ష చేస్తున్న రైతుల దగ్గరకు వచ్చి ఇంతకు ముందు విద్యుత్ సరఫరా చేసిన విధంగా మళ్ళీ ఈ రాత్రి నుండే అమలు అయ్యేలా చూస్తామని పూర్తి హామీ ఇవ్వడంతో బిజెపి జిల్లా అధ్యక్షుడు చింతలపూడి భాస్కర్ రెడ్డి గారు మరియు బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి తాటి కృష్ణ గారు నిమ్మరసం ఇచ్చి నిరాహారదీక్ష విరమింప జేశారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు తెల్ల ప్రసాద్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గాద్దం రాజ్ కుమార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్త నాగ్ విజయ్ మండల అధ్యక్షుడు మద్దినేని తేజరాజ్ జిల్లా ప్రధాన కార్యదర్శి నగరపు రమేష్ జిల్లా ఉపాధ్యక్షుడు కొండూరి నరేష్ జిల్లా అధికార ప్రతినిధి దొంతిరెడ్డి వాసుదేవా రెడ్డి కార్యాలయ కార్యదర్శి చళ్ళూరి మహేందర్ ములుగు మండల అధ్యక్షుడు ఇమ్మడి రాకేష్ యాదవ్ ఏటూరునాగారం మండల అధ్యక్షుడు గండేపల్లి సత్యం తాడ్వాయి మండల అధ్యక్షుడు మల్లెల రాంబాబు యువ మోర్చా జిల్లా అధ్యక్షుడు కొత్త సురేందర్ మైనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు మహ్మద్ యాకుబ్ పాషా దళిత మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి గద్దల రఘు మైనార్టీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ నాగూల్ మీరా కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి జంగా హనుమంతరెడ్డి తాడ్వాయి యువ మోర్చా మండల అధ్యక్షుడు జీడీ ప్రశాంత్ అన్నపురెడ్డి ప్రమోద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

## వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ ములుగు జిల్లా అనుబంధ సంఘం అధ్యక్షులుగా రామసహాయం శ్రీనివాస్ రెడ్డి



**ములుగు,ఏప్రిల్ 15 (అక్షర వెలుగు):** జిల్లాలోని వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ కార్యాలయంలో అనుబంధ సంఘాల అధ్యక్షులు గా నియమించడం జరిగింది అన్న తిరుపతి యువజన విభాగం బద్దుల లక్ష్మి మహిళా విభాగం కారు పాకల రమేష్ బీసీ విభాగం మైదం బాబు దళిత విభాగం వీసం నాగేశ్వరరావు ఆదివాసి గిరిజన విభాగం సయ్యద్ కుతుబుద్దిన్ ముస్లిం మైనార్టీ విభాగం దుగ్యాల ప్రవీణ్ రైతు విభాగం బాడిస సుభాష్ సోషల్ మీడియా విభాగం ఏస్కిక బిక్షపతి ప్రచార కమిటీ విభాగం ఉప్పలపాటి సత్తిబాబు క్రిస్టియన్ మైనారిటీ విభాగంల నియమించారు ఈ సందర్భంగా రామ సహాయం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ సంక్షేమం సమానత్వం స్వయం సమృద్ధి అనే నినాదంతో పనిచేయాలని అన్నారు రాజన్న రాజ్యం కావాలంటే అది వైయస్ షర్మిలమ్మ తోనే సాధ్యమవుతుందని చెప్పారు ములుగు నియోజకవర్గం లో ప్రతి కార్యకర్త కష్టించి పనిచేయాలన్నారు వైయస్సార్ తెలంగాణ పార్టీ విధి విధానాలు ప్రజలకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ఉందన్నారు ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు మహమ్మద్ ఖాదర్ చేను నరేష్ కొండబోయిన సాగర్ బమ్మ చింటూ మర్రి మధు నవీన్ తదితరులు పాల్గొన్నారు

## మధ్యాహ్న భోజన వంట కార్మికులకు పెంచిన వేతనాలను వెంటనే అందించాలి

### డిమాండ్ చేస్తున్న ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్



**ములుగు,ఏప్రిల్ 15 (అక్షర వెలుగు):** ఏటూరునాగారం మండల కేంద్రంలో పోరెడ్డి ప్రమీల గారి అధ్యక్షతన జరిగిన కన్నాయిగూడెం ఏటూరునాగారం మండలాల తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ సమావేశం జరుపగా ముఖ్యఅతిథిగా హాజరైన ఏ ఐ టి యు సి ములుగు జిల్లా ప్రధాన కార్యదర్శి మరియు తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జంపాల రవీందర్ గారు మాట్లాడుతూ మధ్యాహ్న భోజన వంట కార్మికులు చేసిన అనేక పోరాటాల ఫలితంగా రాష్ట్ర ముఖ్యమంత్రి గారు అసెంబ్లీలో మధ్యాహ్న భోజన కార్మికుల వేతనాలు పెంచుతున్నట్లు ప్రకటించడం జరిగింది వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నాము అలాగే పెంచిన వేతనాలను వెంటనే అందించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేయడం జరిగింది వేతనంతో పాటు నిత్యావసర సరుకులు కూడా పెరిగినందున పిల్లలకు ఇచ్చే మెస్ చార్జీలు కూడా పెంచితేనే న్యాయం జరుగుతుంది అన్నారు అందుకు ప్రభుత్వం తరగతుల తో సంబంధం లేకుండా ప్రతి విద్యార్థికి రూ 25 అందించాలని కోరుచున్నాము ఇంకా అనేక సమస్యలు పరిష్కరించడం కోసం ప్రతి మండలంలో కార్మికుల కమిటీలను కోవాలని తద్వారా భవిష్యత్తులో జరగబోయే ఉద్యమాలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు ఈ సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షులు సామల రమ పోరెడ్డి ప్రమీల మణెమ్మ రాజ్యలక్ష్మి సుమతి సత్యవతి రాధిక సావిత్రమ్మ మంఛాల ప్రమీల సుగుణ మధున తదితరులు పాల్గొన్నారు.

## సర్వాపూర్ గ్రామంలో ఘనంగా అంబేద్కర్ విగ్రహ ప్రతిష్టాపన



**ములుగు,ఏప్రిల్ 15 (అక్షర వెలుగు):** ములుగు మండల కేంద్రంలోని సర్వాపూర్ గ్రామంలో విగ్రహ ప్రతిష్టాపన ఘనంగా పెద్ద ఎత్తున విగ్రహ ప్రతిష్టాపన కమిటీ సర్వాపూర్ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో విగ్రహావిష్కరణ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 131 వా జయంతి సందర్భంగా అంబేద్కర్ విగ్రహావిష్కరణ మరియు అంబేద్కర్ జయంతి సభ ప్రొఫెసర్ గుడ్ల తిరుపతి సబ్ అధ్యక్షతన నిర్వహించగా ముఖ్యఅతిథిగా డాక్టర్ అల్లం అప్పయ్య గారు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడినారు సర్వాపూర్ విగ్రహావిష్కరణకు సహకరించిన దాతలను ఘనంగా సన్మానించడం జరిగింది యాదగిరి మన సభ్యులకు అంబేద్కర్ జయంతి సందర్భంగా సర్వ పూర్ గ్రామంలో ఆవిష్కరణ కార్యక్రమంలో జయంతి సభలో పాల్గొని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన ములుగు జిల్లా సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షులు ప్రజా సంఘాల జేపీసీ చైర్మన్ ముంజల భిక్షపతి గౌడ్ అంబేద్కర్ జయంతి సభలో సర్వ పూర్ గ్రామంలో అంబేద్కర్ జయంతి సందర్భంగా జయంతి సభలో మాట్లాడుతున్న ప్రజా సంఘాల జేపీసీ చైర్మన్ ముంజల భిక్షపతి గౌడ్ అనంతరం అంబేద్కర్ విగ్రహ దాత లైనా వరంగల్ ఎస్ ఐ గై కాడి అనిల్ ఎండి జాఫర్ చల్ల గురు గుల భాస్కర్ గారిని ఘనంగా సన్మానించడం జరిగింది కరెంటు ఈ ఈ జనగం నరేష్ హైదరాబాద్ సీఐ రంజిత్ కుమార్ ములుగు ఎస్సై ఓంకార్ యాదవ్ లను కూడా ఘనంగా సన్మానించడం జరిగింది పత్రి శ్రీధర్ ఉప సర్పంచ్ బాగే రాజు అప్పాజీ ఐలయ్య ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగింది గై కాడి సార స్వామి మరియు యూత్ కమిటీ గ్రామ పెద్దలు ప్రతి ఒకరిని సన్మానించడం జరిగింది అంకన్నగూడెం సర్పంచ్ చింతల శ్యామల సర్వాపూర్ సర్పంచ్ దెబ్బ గట్ల జయ ఎంపీటీసీ అల్లం సరస్వతి ప్రభుత్వ అధికారి సాయి బాబా గారు పొడి శెట్టి రిషికేశ్ కాసిం దేవి పేట సర్పంచ్ ఎండి అహ్మద్ భాషా కన్నయ్య గూడెం సర్పంచ్ అల్లం సదానందం బికినీని సంపత్రావు కళాకారుడు బికే అడ్వకేట్ గౌతం గారు వాణి విద్యా నికేతన్ స్కూల్ కరస్పాండెంట్ జంగే టి రాజు గారిని కూడా వారి శిష్యులు రాజు మాస్టర్ గారిని ఘనంగా సన్మానించడం జరిగింది గుండె వీణ రవి గౌడ్ గుండెబోయిన శ్రీహరి గుండెబోయిన భిక్షపతి పంజాల తిరుపతి గుండెబోయిన మహేందర్ గుండెబోయిన సంతోష్ గౌడ సంఘం సర్వాపూర్ గ్రామ కమిటీ అధ్యక్షులు గారిని కూడా ఘనంగా సన్మానించడం జరిగింది.

## బండి యాత్రతో ప్రగతిభవన్‌లో ప్రకంపనలు

- అందుకే పనిగట్టుకుని మంత్రుల విమర్శలు
- వాస్తవాలు దాచాలన్నా దాగవన్న బిజెపి నేతలు



**హైదరాబాద్, ఏప్రిల్ 15 (అక్షర వెలుగు):** బండి సంజయ్ పాదయాత్రకు ప్రజలు బ్రహ్మరథం పట్టడంతో అధికార టీఆర్ఎస్ ఓర్వలేక పోతుందని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డా.కె. లక్ష్మణ్ అన్నారు. ప్రజా సంగ్రామ యాత్ర ప్రగతిభవన్లో ప్రకంపనలు సృష్టిస్తుందన్నారు. ముఖ్యమంత్రి, మంత్రులు మోకాళ్ళ యాత్ర చేసిన ప్రజలు నమ్మే పరిస్థితి లేరన్నారు. అందుకు యాత్రపై వీరంతా విమర్శలకుదిగారని మండిపడ్డారు. వెనుకబడిన పాలమూరు ప్రజలను టీఆర్ఎస్ పార్టీ, ప్రభుత్వం దగా చేసిందన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా 24గంటల ఉచిత విద్యుత్ తెలంగాణ రాష్ట్రంలో ఇస్తున్నామని తెరాస నేతలు పదే పదే చెబుతున్నారు. ప్రజా సంగ్రామ యాత్రపై కేటీఆర్ వ్యాఖ్యలు దయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉంది. తెరాస పడవ మునిగిపోతుందనే భయంతో.. కేటీఆర్ లేఖ రాశారు. పంట చేతికొచ్చే సమయంలో విద్యుత్తు కోతలు సరికాదు. కేసీఆర్ నిజాం తరహా పాలనను అంతమొందించడానికే ప్రజా సంగ్రామ యాత్ర చేపట్టారన్నారు. బీజేపీ ఖచ్చితంగా తెలంగాణలో అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్-టీఆర్ఎస్-మజ్లీస్ ఒక్కటే. ప్రశాంత్ కిషోర్ ప్యాకేజీ కాంగ్రెస్-టీఆర్ఎస్ ను కలిపేందుకే అని లక్ష్మణ్ ఆరోపించారు. బండి సంజయ్ పాదయాత్ర టీఆర్ఎస్ పతనానికి నాంది అన్నారు. తెలంగాణ ప్రజలు డబుల్ ఇంజన్ సర్కార్ కోరుకుంటున్నారు. ప్రభుత్వానికి ఏ ప్రాజెక్టుపై చిత్తశుద్ధి లేదు. ప్రాజెక్టుల పేరుతో దండుకోవాలనేదే ప్రభుత్వ ధ్యాసగా కనిపిస్తోందన్నారు. ఇదిలావుంటే కృష్ణా పుష్కరాల సమయంలో జోగులాంబ ఆలయాన్ని కేసీఆర్ సందర్శించి, అభివృద్ధి చేస్తామని ప్రకటించిన విషయం మరిచిపోయారా అని బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ ప్రశ్నించారు. జోగులాంబ ఆలయం ఇప్పటి వరకు ఎందుకు అభివృద్ధి చేయలేదో సమాధానం చెప్పాలన్నారు. ఒకనాడు మహబూబ్ నగర్ ఎంపీగా, రాష్ట్ర ముఖ్యమంత్రిగా కేసీఆర్ ఉన్న జిల్లా ప్రజలకు కన్నీరే మిగిల్చారు. బండి సంజయ్ పాదయాత్రను విమర్శించే మంత్రులు కృష్ణా నదిలో మూడు మునకలు మునగాలన్నారు. మంత్రివర్గంలో పనిలేని, పనికిరాని మంత్రులు ఎక్కువయ్యారు. ముఖ్యమంత్రి కేసీఆర్ తప్పటడుగులు వేస్తున్నారు. కృష్ణా నీటి వాటా పెంచడంలో టీఆర్ఎస్ సర్కార్ ఘోరంగా విఫలమైందన్నారు. ప్రజాసంగ్రామ యాత్రకు ప్రజలు నీరాజనం పడుతున్నారని ప్రభాకర్ అన్నారు. కేసీఆర్ కేబినెట్ లో పని లేని మంత్రులు, పనికి మాలిన మంత్రులు ఉన్నారని ఎద్దేవా చేశారు. బీజేపీ ఎమ్మెల్యే రఘునందన్ మాట్లాడుతూ మంత్రి కేటీఆర్కు తొందరెక్కువైందని అన్నారు. టీఆర్ఎస్ పునాదులు కదులుతున్నాయన్న ఆందోళన ఆయనలో స్పష్టంగా కనిపిస్తోందని చెప్పారు. సీఎం కేసీఆర్ వల్లే కృష్ణా జలాల్లో తెలంగాణకు అన్యాయం జరిగిందని రఘునందన్ ఆరోపించారు. 290 టీఎంసీల నీటి వినియోగానికి అంగీకరిస్తూ కేసీఆర్ సంతకం పెట్టిన విషయం కేటీఆర్కు తెలియకపోవడం హాస్యాస్పదం అన్నారు. వాస్తవాలు బయటకు రాకూడదన్న ఉద్దేశంతోనే రిటైరైన అధికారుల్ని ఇంకా పదవుల్లో కొనసాగిస్తున్నారని విమర్శించారు. నదీ జలాల పంపకంపై ప్రతినిధుల బృందాన్ని ఏర్పాటు చేయకుండా కేసీఆర్ ప్రభుత్వం ఆలస్యం చేస్తోందని, సుప్రీంకోర్టుకు వెళ్లడం వల్లే కృష్ణా నదీ జలాల పంపకాల్లో జాప్యం జరుగుతోందని రఘునందన్ ఆరోపించారు. 24 గంటలు ఉచిత కరెంటు ఇస్తామన్న హామీ ఏమైందని రఘునందన్ ప్రశ్నించారు. గజ్వేల్, సిద్ధిపేట, సిరిసిల్ల నియోజకవర్గాల్లో మినహా రాష్ట్రంలో మరెక్కడా 24 గంటల కరెంట్ ఇవ్వడం లేదని ఆరోపించారు. రైతుల డిమాండ్ మేరకు రాత్రి పూట కూడా కరెంటు ఇవ్వాల్సి ఉన్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఉచిక కరెంట్ పై క్షేత్రస్థాయి వాస్తవాలు భిన్నంగా ఉన్నాయని, దీనిపై టీఆర్ఎస్ పెద్దలు చర్చకు రావాలని రఘునందన్ డిమాండ్ చేశారు.

## ఆచార్య ట్రైలర్ అదుర్స్

మెగాస్టార్ చిరంజీవి తనయుడు మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ కలిసి నటించిన మెగా మల్టీస్టారర్ 'ఆచార్య' సినిమా 29న భారీ స్థాయిలో రిలీజ్ కాబోతోంది. కొరటాల శివ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమాను నిరంజన్ రెడ్డి -అవినాష్ రెడ్డి నిర్మిస్తున్నారు. కాజల్ అగర్వాల్, పూజ హెగ్డే హీరోయిన్స్‌గా నటించారు. సోనూ సూద్, పోసాని, సంగీత, అనసూయ ముఖ్య పాత్రల్లో కనిపించనున్నారు. రెజీనా ఐటమ్ సాంగ్ ఈ సినిమాకి హైలైట్‌గా నిలవనుంది. మణిశర్మ సంగీత దర్శకుడు. ఆచార్య' రిలీజ్ సమయం దగ్గర పడుతుండటంతో ప్రమోషన్స్ మొదలుపెట్టిన చిత్రబృందం ఇటీవలే థియేట్రికల్ ట్రైలర్‌ను రిలీజ్ చేశారు. ఇందులో చిరు - చరణ్ యాక్షన్ సీన్స్‌లో అదరగొట్టారు. ట్రైలర్‌కే భారీ స్థాయిలో రెస్పాన్స్ వచ్చింది. ఈ నేపథ్యంలో ట్రైలర్ వదిలిన కొద్ది సమయంలోనే అత్యధిక వ్యూస్‌తో పాటుగా లైక్స్‌ను సాధించింది. తాజాగా ఆచార్య ట్రైలర్‌కు అత్యంత వేగంగా మిలియన్ ప్లస్ లైక్స్ రావడం విశేషం. ప్రస్తుతం యూట్యూబ్‌లో ట్రైలర్ భారీ స్థాయిలో వ్యూస్ రాబడుతూ దూసుకుపోతోంది. ఇప్పటికే 26 మిలియన్స్ ప్లస్ వ్యూస్ దక్కించుకుంది. మొత్తానికి రిలీజ్‌కు ముందే ఇలా రికార్డుల వేట మొదల వడంతో సినిమా కూడా భారీ సక్సెస్ సాధిస్తుందని అందరూ ఎంతో నమ్మకంగా చెప్పకుంటున్నారు.

కాగా, ఈ నెల 24వ తేదీన ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించి, 29వ తేదీన విడుదల చేయనున్నారు.




## నేడు కొమ్మ ఉయ్యాల పాట విడుదల

దర్శకధీరుడు రాజమౌళి క్రేజీ మల్టీస్టారర్ 'ఆర్.ఆర్.ఆర్' సక్సెస్ ఎంతంటే..ఇంతని చెప్పలేకుండా ఉంది. ప్రపంచ వ్యాప్తంగా రూ. 1000 కోట్లపైగానే కలెక్ట్ చేసి ట్రేడ్ వర్గాల వారిని ఆశ్చర్యపరిచింది. త్వరలో మరికొన్ని దేశాల్లోనూ రికార్డులు నమోదు చేయడానికి రెడీ అవుతోంది. తాజాగా ఈ సినిమా నుంచి విడుదలైన 'నాటు నాటు' ఫుల్ వీడియో సాంగ్‌కు రికార్డు వ్యూస్ రావడంతో .. మరో సాంగ్ విడుదల చేయబోతున్నారు మేకర్స్. థియేటర్స్ లో ప్రేక్షకులకు మంచి అనుభూతినిచ్చిన 'కొమ్మ ఉయ్యాలా' అనే ఎమోషనల్ సాంగ్ వదలబోతున్నారు. శనివారం సాయంత్రం 4గంటలకు ఈ పాట విడుదల కాబోతోంది. చిన్నారి ప్రకృతి రెడ్డి ఆలపించిన ఈ పాటకి ఆడియన్స్ థ్రిల్ అయ్యారు. అలాంటి ఈ పాట విడుదలవుతుండడంతో అభిమానులు ఖుషీ అవుతున్నారు. కొమరం భీమ్ గెటప్ లో యన్టీఆర్ తన భుజాలపై మల్లిని ఎత్తుకొని పయనమవుతున్న ఫోటోను ఈ సందర్భంగా విడుదల చేశారు. కీరవాణి సంగీతం అందించిన ఈ పాట యూట్యూబ్ లో ఏ స్థాయిలో రికార్డులు సొంతం చేసుకుంటుందో చూడాలి.



## ప్రభాస్ పెళ్లి ఎప్పుడంటే..

నాకే తెలియదంటున్న డార్లింగ్ !



ప్రభాస్ పెళ్లి ఎప్పుడంటే ..ఎప్పుడో చెప్పలేకపోతున్నారు. టాలీవుడ్ మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్ అంటే ప్రభాస్. ఆయన పెళ్లి గురించి అభిమానులే కాదు.. కుటుంబ సభ్యులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ప్రభాస్ సినిమా విడుదలకు ముందు ప్రతిసారీ మీడియా లో ఈ అంశం చర్చగా మారుతూనే ఉంది. ఎంత మంది ఎన్ని అడిగిన ప్రభాస్ సమాధానం మాత్రం ఒకటే. 'టైమ్ రావాలి' అని. ఇటీవల 'రాధేశ్యామ్' ప్రమోషన్స్‌లో 'ప్రభాస్ పిల్లలతో ఆడుకోవాలనుందని' కృష్ణంరాజు తన మనసులో మాట బయటపెట్టారు. ప్రేమ పెళ్లి చేసుకుంటానంటే అందుకు మాకు అభ్యంతరం లేదని ప్రభాస్ పెద్దమ్మ శ్యామలా కూడా వెల్లడించారు. అయితే 'బాహుబలి' తర్వాత పెళ్లి చేసుకుంటానన్న ప్రభాస్ మళ్లీ ఇప్పటిదాకా పెళ్లి ప్రస్తావన తీసుకురాలేదు. తాజాగా ఇంగ్లిష్ మీడియాకు ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో ప్రభాస్ తన పెళ్లి గురించి మాట్లాడారు. ఎక్కడికి వెళ్లినా పెళ్లి ప్రస్తావన తీసుకొస్తున్నారని బాధపడ్డారా? అసహనానికి గురయ్యారా? అని యాంకర్ ప్రభాస్‌ని అడగగా... లేదు.. నా వివాహం గురించి ప్రేక్షకులు అడిగినప్పుడు నేను చిరాకు పడను. నాపెళ్లి గురించి వారు ఎంతగా ఆలోచిస్తున్నారో అని ఆలోచిస్తాను. వారి స్థానంలో నేనున్నా అలాగే ఆందోళన పడేవాడిని అని అన్నారు. మరి పెళ్లి ఎప్పుడు చేసుకుంటారు? ఏమైనా ప్లాన్ చేశారా? అన్న ప్రశ్నకు 'దీనికి సమాధానం దొరికినప్పుడు తప్పకుండా అందరికీ చెబుతారు. పెళ్లి అనే ప్రశ్నకు సమాధానం కోసం ఎదురుచూస్తున్నా అని సమాధానంఇచ్చారు ప్రభాస్. ప్రస్తుతం ఆయన 'స్పిరిట్', 'ఆదిపురుష్', ప్రాజెక్ట్ కె', 'సలార్' సినిమాలతో బిజీగా ఉన్నారు.

## కెజిఎఫ్-2 కలెక్షన్ల వర్షం




కన్నడ సినిమాను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్ళిన చిత్రం 'కేజీఎఫ్'. అప్పటివరకు కన్నడ సినిమాలను ఇతర ఇండస్ట్రీ వాళ్ళు అంతగా పట్టించుకునే వారు కాదు. అలాంటి సమయంలో కేజీఎఫ్ చిత్రం ప్రభంజనం సృష్టించింది. ఎలాంటి అంచనాల్లేకుండా ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం విడుదలైన ప్రతి ఏరియాలో వసూళ్ళ సునామీని సృష్టించింది. ప్రశాంత్ నీల్ టేకింగ్, విజన్‌కు సినీప్రముఖులు సైతం జేజేలు కొట్టారు. ఇక యష్ నటన, అభినయానికి ప్రేక్షకులు థియేటర్లకు బ్రహ్మరథం పట్టారు. 'కేజీఎఫ్ చాప్టర్-2' ఎప్పుడెప్పుడు వస్తుందా అని ప్రేక్షకులు ఎంతగానో ఎదురు చూశారు. ప్రేక్షకుల నిరీక్షణకు ఫలితంగా ఏప్రిల్ 14న చాప్టర్-2 విడుదలై దేశం అంతటా ప్రభంజనం సృష్టిస్తుంది. ఈ చిత్రం ప్రతి ఏరియాలో కేజీఎఫ్ చాప్టర్-1 లైఫ్ టైమ్ కలెక్షన్లను ఒక్క రోజులోనే బ్రేక్ చేసింది. టోటల్‌గా ఈ చిత్రం ఇండియా వైడ్‌గా 134.5 కోట్ల కలెక్షన్లను సాధించింది. అంతేకాకుండా బి÷-గగెస్ట్ హిందీ ఓపెనర్‌గా ఈ చిత్రం రికార్డు సృష్టించింది. బాలీవుడ్ ఖాన్‌లను సైతం వెనక్కి నెట్టి యష్ మొదటి ప్లేస్‌ను అధిరోహించాడు. ఇన్ని రోజులు బి÷-గగెస్ట్ ఓపెనర్‌గా హృతిక్ రోషన్ నటించిన వార్(51.60 కోట్లు) ఉండేది. తాజాగా కేజీఎఫ్ చాప్టర్-2(53.95 కోట్ల)తో వార్ రికార్డును బ్రేక్ చేసి బాలీవుడ్ బి÷-గగెస్ట్ ఓపెనర్‌గా నిలిచింది. ఒక కన్నడ సినిమా బాలీవుడ్‌లో టాప్-1 గా నిలిచిందంటే విశేషం అనే చెప్పాలి. కేజీఎఫ్ చాప్టర్-2' చిత్రం అన్ని ఏరియాలో మంచి కలెక్షన్లను సాధించింది. నైజాంలో కూడా ఈ చిత్రం బాహుబలి రికార్డును చెరిపేసింది. నైజాంలో ఈ చిత్రం 9.68 కోట్ల కలెక్షన్లను సాధించి టాలీవుడ్ టాప్-5 డే1 కలెక్షన్లలో చోటు సంపాదించుకుంది. రెండు తెలుగు రాష్టాల్లో ఈ చిత్రం 19.09కోట్ల కలెక్షన్లను సాధించింది. ఒక డబ్బింగ్ సినిమాకు ఈ స్థాయిలో కలెక్షన్లు రావడం విశేషం అనే చెప్పాలి. ఇక తెలుగులో మొదటి రోజు హైయెస్ట్ కలెక్షన్లను సాధించిన సినిమాగా కేజీఎఫ్ రికార్డును సృష్టించింది. కర్ణాటక(29.25 కోట్లు) కేరళ(7.1కోట్లు), తమిళనాడు(8.2 కోట్లు) సాధించింది. చాప్టర్ చిత్రం కర్ణాటక, హిందీ, కేరళలో హైయెస్ట్ ఓపెనింగ్స్ రాబట్టింది.

## అశోక వనంలో అర్జున కళ్యాణం..వాయిదా !




నటుడుగా, దర్శకుడిగా మంచి గుర్తింప తెచ్చుకున్న యువ హీరో విశ్వక్ సేన్. ప్రస్తుతం ఈయన నటించిన లేటెస్ట్ చిత్రం అశోక వనంలో అర్జున కళ్యాణం. విద్యాసాగర్ చింత దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఇప్పటికే షూటింగ్ పూర్తిచేసుకుంది. ఈ సినిమాను మొదటి నుంచే విభిన్నంగా ప్రమోట్ చేస్తూ ప్రేక్షకుల అటెన్షన్‌ను తమ వైపు తిప్పుకునేలా చేశారు. ఇక ఈ చిత్రం ఏప్రిల్ 22న విడుదల కానున్నట్లు మేకర్స్ ఇదివరకే ప్రకటించారు. అయితే తాజాగా ఈ చిత్ర విడుదల తేదీని వాయిదా వేస్తున్నట్లు మేకర్స్ ప్రకటించారు. నిజానికి ఈ చిత్రం మార్చి 4నే విడుదల కావాల్సి ఉంది. అయితే కొన్ని కారణాలు వల్ల సినిమా వాయిదా పడింది. తిరిగి ఏప్రిల్ 22న చిత్రాన్ని విడుదల చేస్తున్నట్లు మేకర్స్ ప్రకటించారు. అయితే తాజాగా ఈ సారి కూడా సినిమాను వాయిదా వేస్తున్నట్లు మేకర్స్ వెల్లడించారు. రుక్సర్ థిల్లాన్ హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రంలో విశ్వక్ తన ఇమేజ్‌కు భిన్నంగా ఒక సాఫ్ట్ కుర్రాడిలా ఈ సినిమాలో కనిపించనున్నాడు. ఇటీవలే విడుదలై టీజర్, పాటలు సినిమాపై మంచి అంచనాలను పెంచాయి. ఈ చిత్రాన్ని బీవీఎస్ఎన్ ప్రసాద్ సమర్పణలో ఎస్‌వీసీసీ డిజిటల్ బ్యానర్‌పై బాపినీడు.పి, సుధీర్ ఈదర నిర్మిస్తున్నారు.

Edited, Printed, Published & owned by **GOSUKONDA PRUDHVIRAJU**, Published From, H.No. 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, TELANGANA,
Printed at **GPR PUBLICATIONS**. H.NO: 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, Editor: **GOSUKONDA PRUDHVIRAJU**,
TITLE CODE.TELTEL02057, Cell:8464816456 Email: aksharavelugudaily@gmail.com, Website: www.aksharavelugu.com